RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 310 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 డిసెంబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## ముస్లింలు మూడో వివాహాన్ని రిజిస్టర్ చేసుకోవచ్చు

ముంబయి : ముస్లింలు ఒకటి కన్నా ఎక్కువ వివాహాలను రిజిస్టర్ చేసుకోవచ్చని, ఇందుకు వారి పర్సనల్ లా అనుమతి ఇస్తోందని బాంబే హైకోర్టు తెలిపింది. మూడో వివాహం రిజిస్టర్ చేయాలంటూ ఓ వ్యక్తి చేసిన వినతిపై తగిన నిర్ణయం తీసుకోవాలని థాణె మునిసిపల్ కార్పొరేషన్ అధికార్లకు ఆదేశాలు ఇస్తూ ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఆ వ్యక్తి అల్జీరియాకు చెందిన మహిళను మూడో వివాహం చేసుకున్నాడు. దాన్ని రిజిస్టర్ చేయాల్సిందిగా ఫిబ్రవరిలో థాణె మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మ్యారేజీ రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. అయితే మహారాష్ట్ర వివాహ బ్యూరోల నియంత్రణ–వివాహాల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ఒక వివాహాన్ని మాత్రమే రిజిస్టర్ చేసే అవకాశం ఉందని పేర్కొంటూ అతని వినతిని తిరస్కరించారు. దాంతో ఆయన పిటిషన్ దాఖలు చేయగా జస్టిస్ బి.పి.కొలాబావాలా, జస్టిస్ సోమశేఖర్ సుదర్శన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది.

# రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే

## 'రైతు పండుగ' సభలో సీఎం రేవంత్‌రెడ్డి




మహబూబ్‌నగర్: మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దని పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 70 ఏళ్ల తర్వాత వచ్చిన అవకాశాన్ని పోగొట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 'రైతు పండుగ' సభలో సీఎం ప్రసంగించారు. రైతుల కోసం ఇప్పటి వరకు ప్రజాప్రభుత్వం రూ.54 వేల కోట్లు ఖర్చు పెట్టిందని తెలిపారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తు చేశారు. "ఈ రోజు ఎంతో ప్రత్యేకమైంది. సరిగ్గా ఏడాది క్రితం మీరంతా ప్రజాప్రభుత్వం కోసం ఉత్సాహంగా ఓట్లు వేశారు. నిరంకుశ ప్రభుత్వాన్ని దింపి ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. పాలమూరు జిల్లాలో కృష్ణమ్మ పారుతున్నా జిల్లా ప్రజల కష్టాలు తీరలేదు. ఉపాధి కోసం ఎన్నో కుటుంబాలు ముంబయి, హైదరాబాద్‌కు వలస పోయాయి.

బూర్గుల రామకృష్ణారావు తర్వాత ఇన్నాళ్లకు మళ్లీ పాలమూరు బిడ్డ సీఎం అయ్యారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీని పూర్తి చేసిందా? వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్లే అని గత సీఎం అనలేదా? ఈ ప్రభుత్వం మాత్రం వరి వేస్తే.. రూ.500 బోనస్ ఇచ్చి వరి రైతులకు పండుగ తెచ్చింది. గత ప్రభుత్వం రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కట్టింది. మూడేళ్లు నిండకుండానే ఆ ప్రాజెక్టు కూలింది. ఈ ఏడాది రాష్ట్రంలో 1.50లక్షల మెట్రిక్ టన్నుల వరి పండింది. గత ప్రభుత్వం వడ్డీతో సహా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసింది. ఏడాదిలో 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ప్రజా ప్రభుత్వం ఇది. దేశంలోని ఏ రాష్ట్రంలో అయినా ఇంత రుణమాఫీ చేశారా? అని ప్రధాని మోదీ, కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నా. రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది.

**ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా..** గతంలో ఎవరూ భూసేకరణ చేయలేదా.. ప్రాజెక్టులు కట్టలేదా..పరిశ్రమలు నిర్మించలేదా? నా జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపాధి కల్పించాలని భావించాను. కానీ, మాయగాళ్ల మాటలు విని పరిశ్రమలు అడ్డుకుంటున్నారు. వారి మాటలు విని లగచర్ల ప్రజలు కేసుల్లో ఇరుక్కున్నారు. జిల్లాను అభివృద్ధి చేయాలంటే భూ సేకరణ చేయాలా? వద్దా? అధికారులను కొడితే.. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యేవా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చెప్పే మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు. ఇంటికో ఉద్యోగం వస్తే ఆ కుటుంబం తలరాత మారుతుంది. నష్టపరిహారం ఎక్కువ ఇచ్చేందుకైనా సిద్ధంగా ఉన్నాం. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. వచ్చిన అవకాశాన్ని జార విడుచుకోవద్దు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉంది. కానీ, పరిశ్రమల కోసం మాత్రం 1300 ఎకరాల భూమి సేకరించొద్దా.

పాలమూరు ప్రజలకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాం. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా. ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఈ సారి వాడీ వేడిగా అసెంబ్లీ సమావేశాలు

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాల ముహూర్తం ఖరారు అయింది. డిసెంబర్ 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనుండగా ఈసారి సమావేశాలు వాడివేడిగా జరగనున్నాయి. ప్రధానంగా రైతు సమస్యలు, కులగణనపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ సర్కారు ప్లాన్ చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టంతో పాటు పంచాయతీ ఎన్నికలపై



కూడా గవర్నమెంట్ కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. అలాగే మంత్రివర్గ విస్తరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిసింది. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించగా ఆశావాహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. త్వరలో సర్పంచ్ ఎలక్షన్స్ నిర్వహించాలని భావిస్తోంది సర్కార్. అలాగే పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పెన్షన్, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని పెంచేందుకు రేవంత్ సర్కారు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

## రైతులకు మంత్రి గుడ్‌న్యూస్.. జనవరి మాసాంతానికి పూర్తిస్థాయి రుణమాఫీ

హైదరాబాద్–కోదాడ జాతీయ రహదారి ఆరు లైన్లకు విస్తరిస్తామని మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సాగర్ ఎడమ కాలువ కింద భూములకు రెండు పంటలకు నీళ్లు ఇస్తామని పేర్కొన్నారు. హుజుర్నగర్, కోదాడ, తుంగతుర్తి లలో ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తామని.. ఎస్.సి, ఎస్.టి, బి.సి, ఓసిలలో పేద విద్యార్థులకు ఇందులో అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఒక్కో పాఠశాల ఏర్పాటుకు రూ.300 కోట్లు ఖర్చు చేయనున్నామని వెల్లడించారు. అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల నుండే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టామన్నారు. మహిళామణులకు ఉచిత బస్ ప్రయాణం నుండే హామీల అమలు స్టార్ట్ అయ్యిందన్నారు. గృహజ్యోతి పథకంలో భాగం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలుచేస్తున్నామన్నారు. యావత్ భారతదేశంలోనే రుణమాఫీ చరిత్ర సృష్టించింది.. జనవరి మాసాంతానికి పూర్తి స్థాయిలో రుణమాఫీ చేస్తామని చెప్పారు. 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాం.. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ళు జారీ ప్రక్రియ మొదలవుతుందన్నారు. త్వరలో హుజుర్నగర్,కోదాడలకు రైల్వే లైన్లు వస్తాయన్నారు. మూసీ ప్రక్షాళనతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆయకట్టు పెరగడంతో పాటు జిల్లాకు సురక్షితమైన త్రాగు నీరు వస్తుందన్నారు. దాన్యం దిగుబడిలో తెలంగాణా రికార్డ్ సృష్టించిందన్నారు.. యావత్ భారతదేశంలోనే ఇది రికార్డ్.. 66.7 లక్షల ఎకరాల్లో 40 లక్షల రైతాంగం సాధించిన ఘనత అన్నారు. జనవరి 10 వరకు ధాన్యం కొనుగోళ్లు ఉంటాయన్నారు. రైతులెవరు తొందర పడొద్దన్నారు. గ్రామంలోని చివరి గింజ వరకు కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. నీటిపారుదల శాఖను బీఆర్ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు. లక్షా 80 వేలు ఖర్చు చేసిన నాటి ప్రభుత్వం ఒక్క ఎకరా కొత్త ఆయకట్టు సృష్టించలేక పోయిందన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ది అదే దుస్థితి.. ఆ ప్రాజెక్ట్ మీద ఖర్చు అయితే పెట్టారు కానీ ఎకరాకు నీళ్లు అందించలేక పోయారు.. పెండింగ్ లో ప్రాజెక్ట్ లు ఉన్నా కాలువలు దెబ్బతిన్నా సత్వరం మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. హుజుర్ నగర్,కోదాడలలో బీఆర్ఎస్ ప్రభుత్వం లిఫ్ట్ లను నిర్లక్ష్యం చేసిందన్నారు. నీటి లభ్యత ఉన్న చోట్ల




లిఫ్ట్ ల ఏర్పాటు చేస్తామన్నారు. డబుల్ బెడ్ రూమ్ పేరుతో నిన్నటి ప్రభుత్వం మోసం చేసింది.. పదేళ్ళలో పట్టుమని పదివేల ఉద్యోగాలు నియమించలేక పోయారు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలలోనే 50 వేల ఉద్యోగాలు నియమించామన్నారు. డిసెంబర్ 7 నుండే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడింది. యావత్ తెలంగాణా సమాజం అభీష్టానికి అనుగుణంగా ప్రజాపాలన ఆవిష్కృతమైందన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

# పల్లెపోరు




## పంచాయతీ ఎన్నికలకు వడివడిగా అడుగులు!

## ఈ నెలలోనే నోటిఫికేషన్ - ఫిబ్రవరిలో ఎన్నికలు!!?

హైదరాబాద్ : పంచాయితీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కోసం ప్రభుత్వం కసరత్తులు ముమ్మరంగా చేపడుతోంది. ఈ క్రమంలో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత, రిజర్వేషన్లలో మార్పులు చేర్పులపై వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటివరకు మొత్తం మూడు ఫేజ్‌లలో పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం, జనవరి 14వ తేదీకి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫిబ్రవరి రెండో వారంలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. రిజర్వేషన్లపై తుది నిర్ణయం ప్రభుత్వానిదే అని, సుప్రీం కోర్టు మార్గదర్శకాలు అనుసరించి రిజర్వేషన్లు ఉంటాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అలాగే, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని తెలిపింది. శాసనసభ ఎన్నికల జాబితాలు ఆధారంగా.. వార్డులు, గ్రామ పంచాయతీలు వారీగా ఓటర్ల జాబితాలు రూపొందించబడినట్లు కమిషన్ ప్రకటించింది.

రాష్ట్రవ్యాప్తంగా.. 12,867 గ్రామ పంచాయతీలు, 538 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీలకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఇప్పుడు సర్పంచ్ పదవికి యమ క్రేజ్..సర్పంచ్ పదవి పై యువత ఉత్సాహం...** స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే పోటీల్లో ఉండాలని అటు యువత ఇటు పలు పార్టీల రాజకీయ నాయకులు ఇప్పటినుంచి ప్రయత్నాలు మొదలు పెట్టారు. గతంలో పోలిస్తే ఎన్నడూ లేని విధంగా ఈసారి యువత రాజకీయాల్లోకి రావడానికి అదేవిధంగా సర్పంచ్ పదవిపై పోటీ చేసేందుకు ఎక్కువ మక్కువ చెపుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో అటు రూలింగ్ లో ఇది ప్రతిపక్షంలో ఎక్కువగా కనిపిస్తున్నది. యువ లీడర్లే గ్రామాలలో ఇప్పటికే రాజకీయ నాయకులు లోలోపల ప్రచారాలు చేపట్టారు అనే ఊహగణాలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు గ్రామాలలోని రచ్చబండ అదేవిధంగా చౌరస్తాలలోని ప్రధాన కూడలిలో ఉన్న పెద్ద మనుషులతో ఎం పెద్దయ్య, ఏం పెద్దమ్మ బాగున్నారా ఈసారి సర్పంచ్ కి నిలబడదామని అనుకుంటున్నాను, ఒకసారి కలిసి వెళ్లిపోదామని వచ్చాను, అని మాట ముచ్చట కలుపుతున్నారు. రాజకీయ నాయకులు ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడానికి ఎక్కువ సన్నాహాలు చేస్తున్నారు.

అటు కాంగ్రెస్ రాజకీయ నాయకులు అధికారంలో ఉన్న అభివృద్ధి చేస్తున్నాం కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో మేమే గెలుస్తాం అనే ధీమాతో ఉన్నారు కాదు కాదు ఆరు గ్యారెంటీ ల వల్ల ప్రజలు పూర్తిగా మోసపోయారని ఈసారి బీఆర్ఎస్ పార్టీకె పట్టం కడతారని రాబోయేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. ఏది ఏమైనా గ్రామాల్లోని కుల సంఘాల నాయకులతో గతంలో రాజకీయ అనుభవాలున్న పెద్ద మనుషులతో మంతనాలు చేస్తున్నారు. రాజకీయ నాయకులు అదేవిధంగా ఈసారి కచ్చితంగా బరిలో ఉంటాను అని బల్ల గుద్ది మరీ చెబుతున్నారు. కొందరు నాయకులు గ్రామాలలోని స్థానిక వాట్సప్ గ్రూపులలో ఈసారి మా ఫలానా వ్యక్తి సర్పంచికి గెలుపు పక్క లే లేదు మా ఫలానా వ్యక్తి పక్క అనే విధంగా వాట్సాప్ గ్రూప్ చర్చ వేదికగా మారింది.

ఏది ఏమైనా అసెంబ్లీ, పార్లమెంట్ ఎలక్షన్ల కన్నా స్థానిక సంస్థల ఎలక్షన్లు కోసం ప్రజలు ఎదురుచూపులు అంతా ఇంతా కాదు ఇది ఇలా ఉంటే కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ పార్టీ గ్రామ స్థాయిలలో పెద్దగా కనిపించడం లేదు. అప్పుడప్పుడు కనిపిస్తున్నా కూడా ప్రజల్ని సరిగా పట్టించుకోవడం లేదని ఊహాగానాలు ఉన్నాయి. ఎక్కడ సభలు పెడతారు ఎక్కడ సమావేశాలు చెబుతారు వారికి తెలియదని కొందరు బీజేపీ శ్రేణులు అంటున్నారు. మీరు ఇలా ఉంటే మిగతా కొన్ని పార్టీలు వారు వారి సిద్ధాంతాల కోసం బాగానే పనిచేస్తున్నాయని కొందరు అభిప్రాయం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రజలు పట్టం కడతారు వేచి చూడాల్సి ఉంది.

# సంపాదకీయం

## పార్లమెంట్ లో ముగ్గురు గాంధీలు

ఒకేసారి తల్లీ కొడుకూ కూతురు ఎంపీలుగా ఉన్న హిస్టరీ ఇటీవల కాలంలో లేదు. గతం తరచినా కూడా అది జరిగినట్లుగా లేదు. దేశానికి తొలి ప్రధాని పండిట్ నెహ్రూ హయాంలో ఆయన కుమార్తె ఇందిరాగాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ఉండేవారు. అలా తండ్రీ కుమార్తె పార్లమెంట్ లో ఉన్నారు. ఇక ఇందిరాగాంధీ 1980లో మూడవసారి దేశానికి ప్రధాని అయ్యాక మొదట సంజయ్ గాంధీ అమేథీ నుంచి ఎంపీగా గెలిచారు. అలా తల్లీ కొడుకూ ఒకేసారి లోక్ సభలోనే కనిపించారు. అయితే సంజయ్ గాంధీ అతి తక్కువ సమయమే ఎంపీగా ఉన్నారు.ఆయన 33 ఏళ్ళకే అకాల మృత్యువాత పాడడంతో ఆ ప్లేస్ లోకి రాజీవ్ గాంధీ వచ్చారు. ఆయన తన తల్లి ప్రధానిగా ఉండగా జస్ట్ ఎంపీగా ఉన్నారు. 1984లో రాజీవ్ గాంధీ ఇందిర హత్యానంతరం దేశానికి ప్రధాని అయిపోయారు. ఏ మంత్రి పదవీ చేపట్టకుండా ప్రధాని అయిన వారు ఆయనే. కట్ చేస్తే తిరిగి 2004లో మళ్ళీ తల్లీ కొడుకూ లోక్ సభలో ఎంపీలుగా ఒకేసారి కనిపించారు. 1999లో తొలిసారి అమేథీ నుంచి గెలిచిన సోనియా 2004లో తాను రాయబరేలీకి మారి అమేథీలో రాహుల్ గాంధీకి అప్పగించారు. అలా రాహుల్ మొదటిసారి ఎంపీ గా గెలిచి వచ్చారు. ఇలా తల్లీ కొడుకూ 2024 వరకూ అంటే రెండు దశాబ్దాల పాటు పార్లమెంట్ లో కలిసే పనిచేశారు. ఇపుడు మరో అంకం మొదలైంది. అదే ప్రియాంకం. రాహుల్ గాంధీ చెల్లెలు అయిన ప్రియాంకా గాంధీ వయనాడ్ లోక్ సభ సీటు నుంచి ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో నాలుగు లక్షలకు పైగా భారీ మెజారిటీతో గెలిచారు. ఆమె గురువారం పార్లమెంట్ లో ఎంపీగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమం వీక్షించడానికి సోనియాగాంధీ ప్రత్యేకంగా గ్యాలరీ వద్దకు వచ్చారు. రాహుల్ గాంధీ తన చెల్లెలుని తోడ్కొని మరీ పార్లమెంట్ కి వచ్చారు. కాంగ్రెస్ శ్రేణులు అయితే ప్రియాంక ఎంపీగా ప్రమాణం చేయడాన్ని ఎంతో హుషారుగా పండుగ చేసుకున్నారు. ఇదిలా ఉంటే ప్రియాంక గాంధీ లోక్ సభ ఎంపీ కావడంతో అక్కడ అన్నా చెల్లెలూ ఇద్దరూ కనిపిస్తారు. ఇక రాజ్యసభలో సోనియాగాంధీ ఉన్నారు. అలా ఒకే పార్లమెంట్ హౌస్ లో తల్లీ ఇద్దరు బిడ్డలూ ఎంపీలుగా ఉండడం అంటే అరుదైన ఘటన అని అంటున్నారు. ఇందిరాగాంధీ టైం లో కానీ నెహ్రూ టైం లో కానీ ఇలా జరగలేదు అని అంటున్నారు. ఇవన్నీ చూసిన వారు పార్లమెంట్ లో ముగ్గురు గాంధీలు అని అంటున్నారు. మరో వైపు చూస్తే ప్రియాంకను చూసిన తరువాత కాంగ్రెస్ శ్రేణులలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. కాంగ్రెస్ కి ఆమె ఆశాకిరణంగా మారుతారు అని అంటున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ కి గాంధీ కుటుంబమే ఆలంబన. ఆ కుటుంబం అంతా ఇపుడు ఎంపీలుగా ఉన్నారు. మరి దీనిని చూసి కాంగ్రెస్ శ్రేణులు అంతా సంబరం వ్యక్తం చేస్తూంటే ప్రత్యర్థి పార్టీలేమో వారసత్వం రాజకీయాలు అంటే ఇవే అని అంటున్నారు. బీజేపీ ఎపుడూ కాంగ్రెస్ అంటే గాంధీల మయం అని అంటుంది. ఇపుడు ఏకంగా పార్లమెంట్ లోనే ముగ్గురు గాంధీలను చూసి తన ఆరోపణలను మరింత బలంగా చేసేందుకు అస్త్రాలను సిద్ధం చేసుకుంటుంది అని అంటున్నారు.

# సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా




హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా అంటున్నారు. క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ.. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది.

దిగుబడి ఇలా..ఉమ్మడి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకొచ్చారు. మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. సన్నాలకు కేంద్రం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళతాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

కానీ సన్న ధాన్యం మిల్లింగ్‌కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఈ సమస్య కొలిక్కి వచ్చిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రారైస్ మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు తనుకు సురేశ్ తదితరులు కోరుతున్నారు. ఇదీ సమస్య సాధారణంగా దొడ్డు రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు.

దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాలని ప్రభుత్వం అంటుందని చెబుతున్నారు.

సన్నరకాలను తీసుకొని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోతామని వాపోతున్నారు.

అందుకే తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు.

క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు.

దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ ఛార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యల తమను వేధిస్తున్నాయని అంటున్నారు.రారైస్ క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారని, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు.

# చోరీలు పరిపాటి.. రికవరీ ఏపాటి?



కరీంనగర్ : జగిత్యాల జిల్లాలో మూడు నెలలుగా చోరీలు పెరిగాయి. ఇళ్లతో పాటు చిన్న ఆలయాలు, దుకాణాల్లోకి చొరబడుతూ దొంగలు అందిన కాడికి దోచుకెళ్తున్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 302 చోరీలు జరిగాయి. సగటున రెండు రోజులకో కేసు నమోదైంది. సిరిసిల్ల జిల్లాలోనూ అడపాదడపా చోరీ ఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా కేసుల్లో దొంగలు చేతివాటం చూపారు. ఈ ఏడాది జులై 7న పట్టపగలే అలుగునూరులో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు 8 తులాల బంగారు ఆభరణాలు సహా రూ.46 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం సభ్యులు ఇప్పటివరకూ దొంగలను గుర్తించలేదు. రెండు, మూడు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేశారు. బాధితులు మాత్రం ఠాణా చుట్టూ తిరుగుతున్నారు.

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 2022లో అన్ని రకాల చోరీలు కలిపి 248 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఎఫ్ఐఆర్‌లు నమోదైనవి. కేసు కాకుండా బాధితులు వెనుదిరిగినవి మరో 200 వరకుంటాయి. 2023లో 330 చోరీలు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకే ఆ సంఖ్య 300 దాటింది. గతేడాది రూ.2 కోట్ల విలువైన సొత్తు చోరీకి గురి కాగా పోలీసులు రూ.94,91,786ను మాత్రమే తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతేడాది నమోదైన 327 కేసుల్లో 158 మాత్రమే ఛేదించారు. రూ.1.58 కోట్లు పోగా రూ.59.70 లక్షలు బాధితులకు ఇప్పించగలిగారు. రూ.కోటి వరకు రికవరీ కాలేదు. అంతకుముందు ఏడాది(2022)లో 114 ఘటనల్లో దొంగలు పట్టుబడ్డారు. 121 కేసుల అతీగతి లేదు. రూ.45.04 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది 200 వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

పెద్దపల్లి జిల్లాలో 2022లో 679 చోరీలు జరిగాయి. బాధితులు రూ.4.47 కోట్లు పోగొట్టుకోగా రూ.59.21 లక్షలు మాత్రమే తిరిగి ఇప్పించగలిగారు. గతేడాది 725 ఎఫ్ఐఆర్‌లు నమోదై రూ.1.99 కోట్లు పోగా రూ.40.99 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లాలో గతేడాది 113.2 తులాల బంగారు ఆభరణాలను, 1508 తులాల వెండి ఆభరణాలను బాధితులకు అందించగలిగారు. మరో 80 తులాల ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉంది.

పోయింది ఎక్కువ.. ఫిర్యాదులో తక్కువ చోరీ ఘటనల్లో బాధితులు ఎక్కువ మొత్తం పోగొట్టుకున్నా పోలీసులు వారితో తక్కువ మొత్తాన్ని ఫిర్యాదుల్లో రాయిస్తున్నారు. రూ.లక్ష కన్నా ఎక్కువ ఉండకుండా చూస్తున్నారు. పెద్ద కేసులపై దృష్టి సారిస్తూ చిన్న చోరీ ఘటనల విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఆలయాల్లో దొంగతనాలు జరిగినప్పుడు తక్కువ మొత్తంలో సొత్తు పోయినట్లు నమోదు చేస్తున్నారు. రికవరీ అయినప్పుడు పూర్తిగా ఇప్పిస్తామని బాధితులను ఒప్పించి ఫిర్యాదులు రాయిస్తున్నారు. ఇక రూ.వేలల్లో పోయిన సొత్తుకైతే కేసులే నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.


# రాబందుల సంరక్షణకు అష్టకష్టాలు

హైదరాబాద్: అంతరించిపోతున్న రాబందుల జాతిని సంరక్షించేందుకు నెహ్రూ జూపార్కు చేస్తున్న ప్రయత్నం ఫలించడం లేదు. కేంద్ర జూ అథారిటీ(సీజడ్‌ఏ) నిపుణులు, జూపార్కు అధికార యంత్రాంగం 15 ఏళ్లుగా చేస్తున్న శ్రమ వృథా అయింది. సీజడ్‌ఏ కూడా సంతానోత్పత్తి కేంద్రానికి ఏడాది కిందట ఆర్థిక సాయాన్ని నిలిపేసింది. ఈ నేపథ్యంలో క్యూరేటర్ సునీల్ ఎస్ హరేమత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. శాస్త్రీయ కారణాలను విశ్లేషిస్తూ సంతానోత్పత్తి కేంద్రానికి 10 జతల కొత్త రాబందులను ఇవ్వాలంటూ సీజడ్‌ఏకు లేఖ రాశారు. రాబందుల సంరక్షణ కేంద్రానికి ఆర్థికసాయాన్ని పునరుద్ధరించాలనివిజ్ఞప్తి చేశారు.

మానవ తప్పిదాలతో..

ఆదిలాబాద్, మహారాష్ట్ర సరిహద్దుల్లో మినహా..ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాబందులు కొన్నేళ్లుగా కనిపించడం లేదు. దేశవ్యాప్తంగానూ ఇదే పరిస్థితి ఉంది. కేంద్ర జూ అథారిటీ వాటి సంఖ్యను ఎలాగైనా పెంచాలన్న ఉద్దేశంతో హర్యానాలోని పింజోర్ జూపార్కులో, నగరంలోని నెహ్రూ జూపార్కులో సంతానోత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాంతోపాటు అంతరించిపోయే దశలోని మూషిక జింకల సంతానోత్పత్తి కేంద్రం కూడా నగరంలో ఏర్పాటైంది. అయితే.. నెహ్రూ జూపార్కులో మూషిక జింకల సంతతి పెరిగినా రాబందుల సంఖ్యలో వృద్ధి లేదు.

గత ఆరు సీజన్లలో మాత్రమే రాబందులు ఒకటి, రెండు గుడ్లు పెట్టాయి. పొదిగి పిల్లను చేయడంలో మాత్రం రాబందులు సఫలం కాలేదు. మగ, ఆడ పక్షుల మధ్య వయసులో వ్యత్యాసం ఉండడం, ఇక్కడి వాతావరణానికి అలవాటుపడకపోవడం, ఇతర కారణాలతో సంతతి పెరగడం లేదు.



# భక్తిశ్రద్ధలతో ఘనంగా మాస శివరాత్రి పూజలు

శామీర్ పేట, (గరుడ వార్త) : భక్తిశ్రద్ధలతో ఘనంగా మాస శివరాత్రి పూజలను నిర్వహించారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్





శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. శామీర్ పేటకు చెందిన భజన మండలి సభ్యుల భక్తి గీతాలు ఆలపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# సర్వజన అవస్థలు

ఖమ్మం : ఖమ్మం జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతో సర్వజనాసుపత్రిగా రూపాంతరం చెందింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. పలు విభాగాల్లో అవార్డులు, రివార్డులూ అందుకుంది. నేడు సదుపాయాలు కొరవడి సతమతమవుతోంది. నిపుణుల కొరత, పని చేయని పరికరాలు, ఆర్థిక ఇబ్బందులతో కునారిల్లుతోంది. పేదలు వైద్యమందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

పడకేసిన పరికరాలు

ఇటీవల సీటీ స్కానింగ్ యంత్రానికి విద్యుత్తు సరఫరా చేసే వైరు కాలిపోయి సేవలు నిలిపివేశారు. కొత్త తీగకు రూ.3.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా. నిధుల లేక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎక్స్‌రే విభాగంలో కంప్యూటెడ్ రేడియోగ్రఫీ(సీఆర్) పరికరం పని చేయడం లేదు. ఇది ఎక్స్‌రే చిత్రాలను నాణ్యమైన డిజిటల్ ఫార్మాట్‌లోకి మారుస్తుంది. సాంకేతిక సమస్యలతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. ప్రతిరోజు 200లకు పైగా ఎక్స్‌రేలు తీస్తారు. నిపుణుడు అందుబాటులో లేకపోవడంతో మరమ్మతులు చేయడంలో



జాప్యం. ప్రత్యామ్నాయంగా పరికరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆన్‌లైన్ సేవలు ఆలస్యం..

ఆస్పత్రిలో ఓపీ నమోదు నుంచి వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికల జారీ వరకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు, సర్వర్లు మొరాయించడం, ప్రింటర్లు పని చేయకపోవడం, సిబ్బంది కొరత కారణంగా ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఓపీ నమోదు చీటీల కోసం గంటల తరబడి బారులుదీరాల్సిన పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులు వేచి ఉండలేక నీరసించిపోతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికలు సకాలంలో అందడం లేదు. నిర్దిష్ట సమయంలో నివేదికలు అందక వైద్య నిర్ణయాలు తీసుకోవడం ఆలస్యమవుతోంది.

ఉష్ణోగ్రత నియంత్రణ అస్తవ్యస్తం

ఐసీయూ(ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఏసీలు పని చేయడం లేదు. ప్రాణాపాయ స్థితిలో రోగులకు ఇక్కడ చికిత్సలు అందిస్తారు. రోగుల ఆరోగ్యం నిలకడగా ఉండేందుకు శీతల వాతావరణం అవసరం. ఏసీలు మరమ్మతులకు గురి కావడంతో రోగుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతలు శరీర వేడిని పెంచడంతో ఆక్సిజన్ స్థాయిలు తగ్గుతాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు వేగంగా వ్యాపిస్తాయి. ఇన్‌ఫెక్షన్ల తీవ్రత పెరిగే ప్రమాదం ఉంది. రోగులు, సిబ్బంది దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.

రేడియాలజిస్టుల కొరత..

పలు విభాగాల్లో పరికరాలున్నా రేడియాలజిస్టులు లేక పరీక్షలు చేయడం లేదు. గర్భధారణ శిశువు ఎదుగుదల నిర్ధారణకు 18, 23 వారాల్లో టిఫా పరీక్షలు చేయాలి. రెండు పరికరాలున్నా నిపుణులు లేరు. పలుమార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఎవరూ రావడం లేదు. ప్రభుత్వం రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయడం లేదు.

ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా పరికరాల మరమ్మతులకు టెక్నీషియన్లు బయట నుంచి రావాల్సి ఉందని.. ఆర్థిక అవసరాలు, నిపుణుల నియామకం అంశాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. అత్యవసర రోగులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

## 12 ఏళ్లుగా నిరుపయోగంగా..

కోరుట్ల : కోరుట్ల మండల కేంద్రంలో నిర్మించిన స్త్రీశక్తి భవనం ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(టీ–సెర్ప్) కోరుట్ల మండల కార్యాలయాన్ని ఆదర్శనగర్‌లో 2010లో చిన్న భవనంలో ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 986 మహిళా సంఘాలు, మొత్తం 10,160 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పాత భవనం సరిపోకపోవడంతో కార్యాలయ ఉద్యోగులు, మహిళలు చాలా ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2012లో అప్పటి ప్రభుత్వం మండలానికి ఒక అధునాతన స్త్రీ శక్తి భవనం నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.25 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో మండల పరిషత్ కార్యాలయం వెనకాలున్న ఖాళీ స్థలంలో నూతన భవన నిర్మాణం ప్రారంభించారు. నిధులు సరిపోకపోవడంతో 2016లో మరో రూ.7 లక్షలను కేటాయించారు. మొత్తం రూ.32 లక్షల నిధులు వెచ్చించి స్త్రీ శక్తి భవనం నిర్మించారు.

# ప్రతిపాదనలు ఘనం.. అమలు అర్ధంతరం

సిరిసిల్ల : జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు చేపట్టడం లేదు. 2023–24 బడ్జెట్‌లో రెండు పురపాలికల్లో కలిపి వివిధ విభాగాల్లో అభివృద్ధికి రూ. 118.36 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. వీటి మంజూరుకు ప్రభుత్వానికి కూడా పంపారు. వాటిలో రూ.18 కోట్లు మాత్రమే ప్రభుత్వం నుంచి విడుదల య్యాయి. అంటే నిర్ణయించిన బడ్జెట్‌లో 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. రెండు పురపాలికల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పన్నుల రూపంలో వస్తున్న రూ.4 కోట్ల ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇతరత్రా ఖర్చులే నెలకు రూ.కోటిపైనే ఉంటున్నాయి. వీటిలోనూ చాలా వరకు గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు ఉన్నాయి.

ముందుకు రాని గుత్తేదారులు

2023–24 పురపాలక బడ్జెట్‌లో రూ.47.70 కోట్లతో వార్డుల వారీగా మురుగుకాల్వలు, సీసీ రహదారులు, కేంద్రీయ విద్యుద్దీకరణ, కూడళ్ల విస్తరణకు టీయూఎఫ్ఐడీసీ కింద ప్రతిపాదనలు చేశారు. వీటిలో సీసీ రహదారులు, మురుగు కాల్వల పనులు టెండర్ల దశలో నిలిచిపోయాయి.రూ.3 కోట్లతో కలెక్టరేట్–రగుడు కూడలి విస్తరణ



పనులు దక్కించుకున్న గుత్తేదారు పైపైన పనులు చేసి వదిలేశాడు. ఏడాదిగా ఆ పనులు ముందుకు సాగడం లేదు. చంద్రంపేట, శాంతినగర్, నర్సింగ్‌కాలేజీ, సంజీవయ్య కూడళ్ల అభివృద్ధికి రూ.2 కోట్ల పనులు దక్కించుకున్న గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రూ.2 కోట్లతో కళాశాల ఆవరణలో క్రీడా మైదానం పనులు ప్రారంభించి వదిలేశారు.సిరిసిల్ల- వెంకటాపూర్ బాహ్యవలయ రహదారిలో రూ.4.60 కోట్లతో కేంద్రీయ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పురపాలికకు అప్పగించలేదు. గత ప్రభుత్వ హయాంలో పురపాలికలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో పురపాలికలో అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్ద ఎత్తున బకాయిలు పడింది. ఇటీవల వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

వేములవాడ పురపాలికలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే అంబేడ్కర్ కూడలి విస్తరణ, క్రీడా మైదానంలో ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పురపాలికలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో సిరిసిల్ల పురపాలక కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ నిధుల విడుదలకు ఉన్నతాధికారులను కోరుతూ రెండు నెలల క్రితం లేఖ రాశారు. దీనికి గతంలో నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన పనులను చేసుకునేలా మౌఖికంగా ఆదేశించారు. ప్రతిపాదించిన పనులకు నిధుల మంజూరు విషయమై ఎలాంటి సమాచారం రాలేదు. విలీన గ్రామాలు, శివారు కాలనీలో అంతర్గత రహదారులు, మురుగుకాల్వల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

# కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

కరీంనగర్ : ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..

ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.



రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలుచోట్ల సేవలు అందించారు. 2018– 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్టులను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని అందించాలి.

# కంది.. కాలం కలిసొచ్చింది!



తాండూరు: పప్పుధాన్యాల్లో 'పోషకాల గని'గా పేరున్న కంది పంట సాగు జిల్లాలో ఈసారి ఆశాజనకంగా ఉంది. డిసెంబరు చివరి నుంచి చేతికి అందే దిగుబడులపై రైతులు ఆశలు పెంచుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పత్తి, పెసలు, మినుములు, మక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయి. నామమాత్ర దిగుబడులే చేతికి అందాయి. ఈనేపథ్యంలో సాగులో ఆరోగ్యంగా ఉన్న కందుల నుంచి ఆర్థిక లబ్ధి పొందుతామనే విశ్వాసంతో ఉన్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం క్వింటాలు కందులకు నిర్ణయించిన మద్దతు ధరకంటే ఈసారి ఎక్కువ ధరను ప్రకటించింది.

**అనుకూలించిన వర్షాలు**

సాగులో ఉన్న కంది పంటకు వర్షాలు అనుకూలించాయి. ఏటా సెప్టెంబరు, అక్టోబరులో వర్షాభావ పరిస్థితుల కారణంగా చెల్కభూముల్లో పంట ఏపుగా పెరగక దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చేవి ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. వర్షాలు భారీగా కురవడంతో తేమ తగ్గలేదు. ఈ పరిణామం సాగులో ఉన్న పైర్లకు అనుకూలించింది. ఇటు రేగడి అటు చెల్క పొలాల్లో పైర్ల సాగు బాగుంది. జులై, ఆగస్టులో పైర్లు పెరిగే తొలి దశలో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు పొలాల్లో కొంత మేరకు దెబ్బతిన్నాయి. వర్షాలను తట్టుకుని నిలిచిన పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. : 2023–24 ఆర్థిక సంవత్సరంలో తాండూరు సహా మిగిలిన తొమ్మిది విపణుల్లో కలిపి రైతులు 2లక్షల క్వింటాళ్లకు పైబడి కందుల విక్రయాలు చేశారు.

**తాండూరు రకంలో 'అట్టాపుల్ గేట్'**

తాండూరు నియోజకవర్గంలో కంది పంట సాగయ్యే నేలల్లో 'అట్టాపుల్ గేట్' అనే ఖనిజం ఉంది. సాగులో ఉన్న కంది పైరు కాండం ధ్రుఢంగా ఉండేందుకు ఈ ఖనిజం దోహదం చేస్తుంది. నాణ్యమైన గింజలు రావడానికి, అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూస్తుంది. ఆమేరకు తాండూరు ప్రాంతంలో సాగయ్యే కందులతో ఉత్పత్తి చేసిన పప్పుకు రుచి ఎక్కువ.

**పచ్చపురుగు నివారణలో నిర్లక్ష్యం చేయొద్దు**

– డాక్టర్ సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, తాండూరు.

జిల్లాలో కంది పైర్లపై ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పచ్చపురుగు ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంది. పురుగు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు.లీటరు నీటికి 0.3మి.లీ స్పైనోషాడ్ లేదంటే క్లోరో ఫైరిఫాస్ లీటరు నీటికి 2.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

# పూడిక తీయరు.. మరమ్మతు చేయరు



సారంగాపూర్ : ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతుతోపాటు పూడిక తొలగించకపోవడంతో ఏటా చివరి గ్రామాల ఆయకట్టు రైతులకు నీరందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. వానాకాలం పంటలకు నీటి ఇబ్బంది లేనప్పటికీ యాసంగి పంటలకు చివరి దశలో సాగు నీరందక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. డి–53, 12ఎల్ ద్వారా ఎస్సారెస్పీ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు నీరందిస్తున్నారు. కొంత కాలంగా కాలువల్లో పూడిక తొలగించక పోవడంతో చివరి గ్రామాలకు నీరు చేరుకోవడం లేదు. అంతేకాకుండా కాలువలపై ఉన్న తూములు, గండ్లు పూడ్చకపోవడంతో పైప్రాంతంలో నీరు వృథా అవుతోంది. చివరి గ్రామాలైన సారంగాపూర్, బట్టపల్లి, పోతారంతోపాటు పలు గ్రామాలకు నీరు చేరకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉండడంతో ఆయకట్టు నీటి విడుదల నిలిపివేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల్లో పూడిక తొలగిస్తే కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా రైతులకు ప్రయోజనకరంగా ఉండనుంది. అధికారులు దృష్టి సారించకపోవడంతో చివరి గ్రామాలకు నీరు చేరుకోవడం కష్టంగా మారనుంది. ఆయకట్టు పరిధిలోని 12ఎల్ 1ఆర్ కాలువపై మరమ్మతు చేపట్టేందుకు అధికారులు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. నిధులు మంజూరు చేసి మరమ్మతు చేసినట్లయితే పైప్రాంతంలో నీరు వృథా కాకుండా ఉండడమే కాకుండా చివరి గ్రామాలకు నీరు చేరుకుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**నీటి మళ్లింపునకు ప్రతిపాదనలు**

డి53 ప్రధాన కాలువ నుంచి సారంగాపూర్ చింతల చెరువులోకి నీటిని తరలించేందుకు ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. సారంగాపూర్, బట్టపల్లి, పోతారం రైతులు చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని కాలువ ద్వారా నింపాలని పలుమార్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నిర్వహించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించడంతో పలు మార్లు సర్వే చేపట్టారు. పెంబట్ల పెద్దమ్మ చెరువు నుంచి చింతల చెరువులోకి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకెళ్లవచ్చని సర్వే పూర్తి చేసి ఎమ్మెల్సీకి నివేదించారు. దాదాపు రూ.20 కోట్లు వ్యయం చేసినట్లయితే చెరువులోకి నీటిని మళ్లించవచ్చని ప్రతిపాదనలు తయారు చేసి అందించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి నిధుల మంజూరుకు తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ పలుమార్లు రైతులకు హామీచ్చారు.

**ఇదే అనువైన సమయం- నలువాల రాజయ్య, రైతు**

ఏటా యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరందక పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. ఇప్పుడే కాలువల్లో పూడిక తొలగించి, తూములకు షట్టర్లు బిగించినట్లయితే చివరి వరకు నీరు చేరుకునే అవకాశముంటుంది. చింతల చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపినట్లయితే బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాల రైతులకు సాగునీటి కష్టాలు తొలగనున్నాయి.

**నిధులు మంజూరు కాగానే...- చక్రునాయక్, డీఈఈ, ఇరిగేషన్**

తూముల మరమ్మతుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు చేపట్టనున్నాం. కాలువల్లో పూడిక ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించేలా చూడాలని సంబంధిత ఎంపీడీవోలకు సూచించాం. చింతల చెరువులోకి నీటి మళ్లింపు సర్వే పూర్తి చేసి రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం.

# కృతజ్ఞత.. చూపిద్దాం విజ్ఞత

గోదావరిఖని : ఎదుటి వారి నుంచి ఏ చిన్న సాయం పొందినా వెంటనే కృతజ్ఞతలు చెప్పడం విజ్ఞత. నిత్య జీవితంలో ఒకరి సాయం లేకుండా మరొకరు ముందుకు సాగలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. సాయం చేసిన వారు ఆ విషయాన్ని మరచిపోయినా దానివల్ల లబ్ధి పొందిన వారు కేవలం కృతజ్ఞతలు చెప్పడంతోనే సరిపెట్టుకోకుండా జీవితాంతం గుర్తుపెట్టుకోవడంతో పాటు ఇతరులకు అవసరమైనప్పుడు చేతనైన మేలు చేయడమే నిజమైన కృతజ్ఞతగా చెప్పుకోవచ్చు. నేడు (థాంక్స్ గివింగ్ డే) కృతజ్ఞతా దినోత్సవం సందర్భంగా కథనం.

**ఏ చిన్న సాయానికైనా...**

ప్రతీ విషయంలో వినమ్రతతో ఉండేలా చిన్నప్పటి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలి. ఇతరులకు సాయం చేసేలా ప్రోత్సహించాలి. అమెరికాలాంటి దేశాల్లో పంట కోతలు పూర్తికాగానే ప్రకృతికి, తమకు సహాయం చేసినవారికి కృతజ్ఞతగా పండుగలే జరుపుకుంటారు. పచ్చదనంతో కాలుష్య రహిత వాతావరణాన్ని అందిస్తున్నందుకు ప్రకృతికి కృతజ్ఞతగా మరిన్ని మొక్కలు నాటి భావితరాలకు అందించాలి. ఎదుటి వారు చేసే ఏ చిన్న సాయానికైనా కృతజ్ఞతలు చెప్పే మనం అన్నీ సమకూర్చిన సమాజానికి కృతజ్ఞతలు చెప్పాలి.వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వారెందరో. ఇలాంటి వారికి చేసిన ఏ చిన్న సాయమైనా జీవితాంతం గుర్తుంటుంది.నేపథ్యం: 1621వ సంవత్సరంలో అమెరికాలోని ప్లైమాత్‌లో నివసించే వలస వాసులు వారికి సాయం చేసిన తెగల వారితో కలిసి మొదటి సారిగా కృతజ్ఞతా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. అబ్రహం లింకన్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం నవంబరు నెలలో నాలుగో గురువారం కృతజ్ఞతా దినోత్సవాన్ని జాతీయ సెలవు దినంగా ప్రకటించారు. కెనడా, జపాన్, బ్రెజిల్ తదితర దేశాల్లో 'థాంక్స్ గివింగ్ డే' సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపడతారు. సమాజం, వ్యక్తులు, సంస్థలు, ప్రకృతి నుంచి పొందిన సాయానికి కృతజ్ఞతలు చెప్పుకోవడం తమ కర్తవ్యంగా భావిస్తూ సంబరాలు నిర్వహిస్తారు.

**దాతల ఔదార్యం... వృద్ధుల్లో ఆనందం**

పుట్టిన, పెళ్లి రోజుతో పాటు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో చేపట్టే అన్న, వస్త్ర, వస్తు దానాల సమయాల్లో వృద్ధులు, అనాథల కృతజ్ఞతా భావం వారి కళ్లల్లో కనిపిస్తుంది. కొందరైతే కన్నీరు కార్చుకుంటూ దాతలకు ధన్యవాదాలు తెలుపుతుంటారు. దీంతో దాతల్లోనూ ఏదో మేలు చేశామన్న సంతృప్తి నెలకొంటుంది. ఇటీవల గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు బాలల దినోత్సవం వీర్లపల్లిలోని వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఏసీపీ చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినప్పుడు వారు చూపిన కృతజ్ఞతాభావం చిన్నారులను ఆలోచింపజేసింది. మీలో మా మనవలు, మనవరాళ్లను చూసుకుంటున్నామంటూ వారు పిల్లలను దగ్గరకు తీసుకోవడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలో పలువురు నిరుపేదలకు దాతల సహకారంతో ఇళ్లు నిర్మించి ఇచ్చి గృహప్రవేశాలు సైతం చేయించారు. ఆ సమయంలో దాతల పట్ల వారు చూపిన కృతజ్ఞతాభావం జీవితంలో మరువలేని సంఘటనగా గుర్తుండిపోతుంది.

**గుర్తు చేసే రోజు**

ఎప్పటికప్పుడు మనకు పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పుకోవడం అవసరం. ఏడాదికోరోజు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన ఆవశ్యకతపై థాంక్స్ గివింగ్ డే జరుపుకోవడం అవసరమే. జన్మనిచ్చిన తల్లిదండ్రుల నుంచి మొదలుకొని సమాజంలోని వివిధ వర్గాలు, బంధు మిత్రులు, ప్రకృతి సహకారం లేనిదే మనుగడ సాగించలేం. ఈ పరిస్థితుల్లో వారందరికీ కృతజ్ఞతలు చెప్పుకోవడం ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా గుర్తించాలి. తమవంతుగా సమాజానికి సేవ చేసే ప్రవృత్తిని అలవర్చుకోవాలి.డాక్టర్ అనంతబాబు, ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

# పెళ్లికి తిరస్కరిస్తే... నిత్య నరకమే!

హైదరాబాద్ : ఓ జంటకు పెళ్లి సంబంధం ఖాయమైంది. ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆమె ఫోన్ ఎప్పుడూ ఎంగేజ్‌లో ఉన్నా.. యువకుడు అనుమానించేవాడు. యువతి ఇంట్లో చెప్పటంతో పెళ్లి రద్దు చేసుకున్నారు. అవమానంగా భావించిన అతడు.. వాట్సాప్ గ్రూపుల్లో ఆమె గురించి అసభ్యకరంగా పోస్టులు పెడుతూ విషప్రచారం చేశాడు. ఆమె సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అమ్మాయి బెంగళూరులో ఐటీ ఉద్యోగిని. అమెరికా సంబంధమని ఆశపడి పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. వెడ్డింగ్‌షూట్‌లో అతడు అసభ్యకరంగా ప్రవర్తించటం.. రెండ్రోజులు దూర ప్రాంతానికి వెళ్దామంటూ ఒత్తిడి తీసుకురావటంతో యువతి భయపడిపోయింది. విషయం ఇంట్లో చెప్పగానే ఇద్దరికీ జోడు కలవదంటూ పెళ్లికి నిరాకరించారు. దీన్ని మనసులో ఉంచుకొని అతడు.. ఇద్దరూ దిగిన ఫొటోలను మార్ఫింగ్ చేసి పోర్న్‌సైట్‌లో ఉంచాడు. నగరంలో ఇటీవల ఈ తరహా ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. అమ్మాయి తరపు కుటుంబం వివిధ కారణాలతో పెళ్లిని తిరస్కరిస్తే కొందరు ప్రబుద్ధులు తట్టుకోలేకపోతున్నారు. ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధపడుతున్నారు. తప్పుచేయకున్నా.. అమ్మాయిలకు నిత్యం నరకం చూపుతున్నారు.



వధూవరుల అభిరుచులకు తగినట్టుగా మూడుముళ్లు పడకుండానే ఫోన్‌నెంబర్లు మార్చుకుంటున్నారు. ప్రీ వెడ్డింగ్‌షూట్‌లతో ఒకరి మనసు ఒకరు తెలుసుకుంటారనే అభిప్రాయంతో తల్లిదండ్రులు బిడ్డల ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యమిస్తున్నారు. పెళ్లిపీటలు ఎక్కేముందు తమకు సరైన జోడు కాదని ఆడపిల్లలు భావిస్తే తల్లిదండ్రులు నిరాకరిస్తున్నారు.

**ఇది సరికాదు...**

పెళ్లి చూపులు పూర్తవగానే అమ్మాయిలు తమ వ్యక్తిగత వివరాలు, కుటుంబ విషయాలు, ఫోన్ నంబర్లు ఇవ్వొదని పోలీసులు సూచిస్తున్నారు. తల్లిదండ్రుల ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు. పెళ్లిముసుగులో కొందరు ప్రబుద్ధులు ప్రదర్శించే వికృతాలను గుర్తించినపుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

# దగ్గరి దారి.. అధ్వానంగా మారి

మంథని : అటు ఆర్‌అండ్‌బీ శాఖ, ఇటు పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి రాకపోవడంతో రాకపోకలకు దినదిన గండంగా మారింది. మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రహదారి అడుగడుగునా మలుపులు, గుంతలతో అధ్వానంగా తయారైంది. మరమ్మతుకు, విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి.గతంలో వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లేందుకు ఈ మార్గంలో మట్టి దారి ఉండేది. పదేళ్ల కిందట సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కేపల్లి, లద్నాపూర్ భూ నిర్వాసితులకు పునరావాస కాలనీ కోసం రూ.2 కోట్ల వ్యయంతో ఒక వరుస తారు రోడ్డు నిర్మించింది. ఈ మార్గంలో మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. గతంలో రోజుకు సుమారు 20 వాహనాలు నడిచేవి. ఏడాది కిందట ఖమ్మంపల్లి, భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన ప్రారంభించడంతో వేయి వరకు వాహనాలు నడుస్తున్నాయి. అర గంటకు 50కి పైగా వాహనాలు వెళ్తున్నాయి.

**నెల రోజుల్లో మూడు ప్రమాదాలు**

: జనగలంత వాగు కాలువ నీటితో పాటు బిట్టుపల్లి పెద్దచెరువు నీరు ప్రవహించడంతో ఈ రహదారిపై తరచూ నీరు నిలిచి వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. 2 కిలోమీటర్ల దూరం ఒకే వరుస రహదారి కాగా పలు చోట్ల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా యి. గత నెల రోజుల్లో మూడు ప్రమాదాలు జరిగాయి.

: ఈ మార్గంలో కాజ్‌వే వద్ద వంతెన నిర్మాణంతో పాటు రెండు వరుసల రోడ్డు నిర్మించాల్సి ఉంది. సింగరేణి సంస్థ భూ నిర్వాసితుల కోసం నిర్మించిన రహదారిని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలకు అప్పగించకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదని రచ్చపల్లి వాసులు వాపోతున్నారు.

: రచ్చపల్లి నుంచి ఎగ్లాస్‌పూర్ మీదుగా మంథనికి వెళ్లడానికి రహదారి సౌకర్యం ఉంది. ఆ మార్గంలో వెళ్తే 4 కిలోమీటర్లు అధిక దూరం ప్రయాణించాల్సి వస్తుందని వాహన చోదకులు సూరయ్యపల్లి మీదుగా 3 కి.మీ.ల దూరంలోని మంథనికి వస్తున్నారు.

: సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి మార్గంలో కిలోమీటరు దూరం బాయిల్డ్ రైస్ మిల్లు నుంచి వెలువడుతున్న కలుషిత నీరు ప్రవహిస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.

: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల కిందట గుంతలు పూడ్చినప్పటికీ వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో పరిస్థితి మొదటికొచ్చింది. రహదారిని ఆర్‌అండ్‌బీ శాఖకు గానీ, పంచాయతీరాజ్ శాఖకు అప్పగించకపోవడంతో సమస్య శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి వరకు 2 కిలోమీటర్ల దూరంలో 20కి పైగా గుంతలున్నాయి.

**మలుపు వద్ద ముగ్గురం గాయపడ్డాం**

వారం రోజుల కిందట మంథనికి వెళ్తుండగా మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని ఇద్దరు మహిళలతో పాటు నేను గాయపడ్డా. రద్దీ అధికంగా ఉన్నందున రహదారి విస్తరణతతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. **తీర్థాల కొమురయ్య, ఖమ్మంపల్లి**ఆర్‌అండ్‌బీకి అప్పగిస్తేనే శాశ్వత పరిష్కారంప్రస్తుతం ఏ శాఖ పరిధిలోనూ లేకపోవడంతో రహదారి ఎవరూ పట్టించు కోని అనాథలా మారింది. రహదారులు, భవనాల శాఖకు అప్పగిస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ నెల 20న కారు బైక్ ఢీకొన్న ఘటనలో నాకు తెలిసిన ఇద్దరు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు.గుర్రం సదానందం, రచ్చపల్లి

# రహదారులపై వరి కుప్పలు ప్రమాదాలకు నిలయాలు

సిరిసిల్ల : పంట ఉత్పత్తులు ఆరబెట్టేందుకు కల్లాలు, కొనుగోలు కేంద్రాలు లేక ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. గత్యంతరం లేక రహదారులపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. సిరిసిల్ల పురపాలిక పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక విక్రయాలు పూర్తయ్యేవరకు రహదారిపైన ఆరబెడుతూ అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లోనూ వరికోతలు ఊపందుకున్నాయి. సిరిసిల్ల పురపాలికలో రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్‌లో విస్తారంగా వరిసాగైంది. ఇక్కడ మెప్మా, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తారు. కోతలు ప్రారంభమవడంతో రైతులు సిరిసిల్ల-కామారెడ్డి రెండో బాహ్యావలయ రహదారిపై ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఇక్కడ ప్రతి సీజన్‌లో ఈ కేంద్రాల్లో 54 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు విక్రయిస్తారు.

వరి కోతలు పూర్తయ్యాక రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి బాహ్యావలయ రహదారిపైకి తీసుకొస్తున్నారు. ధాన్యం ఆరబోతకు కల్లాలు లేకపోవడంతో రహదారినే కొనుగోలు కేంద్రాలుగా వాడుతున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికీ ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక.. ధాన్యం ఆరబోత ఇబ్బ ందులతో ఆయా గ్రామాల్లో చాలా మంది రైతులు ఇప్పటికే రైస్‌మిల్లులకు



విక్రయిస్తున్నారు. క్వింటా సాధారణ రకం ధాన్యానికి రూ.2,300, ఏ గ్రేడు రకానికి రూ.2,320 మద్దతు ధర ఉంది. సన్నధాన్యానికి రూ.500 బోనస్ కలుపుకొని రూ.2,820 ధర లభిస్తుంది. కానీ రైతులు క్వింటా రూ.1900లకు విక్రయించి నష్టపోతున్నారు.

సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్దాపూర్‌లో ఉంది. ఇక్కడ ఇరవై వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు ఉన్నాయి. పంట ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేకంగా షెడ్లు కూడా ఉన్నాయి. పెద్దూరు, సర్దాపూర్ గ్రామాలకు మాత్రమే దగ్గరగా ఉంటుంది. మిగతా గ్రామాలకు చాలా దూరంగా ఉంటుంది. రైతులు పంట ఉత్పత్తుల రవాణా భారంతో ఇక్కడికి తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది.

కేంద్రాలకు స్థలాలు లేక...చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లిలో మెప్మా, పెద్దూరు, సర్దాపూర్‌లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తారు. వీటిలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ, సొంత స్థలాలు లేవు. ఏటా రెండు సీజన్లలో నాలుగు నెలలు సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యావలయ రహదారిపైనే విక్రయాలు జరగాలి. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ స్థలం చూపించాలని ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాలు, రైతులు అధికారులను పలుమార్లు కోరారు. వీరి వినతులు బుట్టదాఖలయ్యాయి.

ఇవీ సంఘటనలుసిరిసిల్ల పట్టణానికి చెందిన రాజశేఖర్ (27) ఈ నెల 13న ద్విచక్రవాహనంపై సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యావలయ రహదారి నుంచి సిరిసిల్లకు వస్తున్నాడు. చిన్నబోనాల సమీపంలో ధాన్యం కుప్పను ఢీకొట్టిన వాహనం అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17న మృతి చెందాడు. గతేడాది వానాకాలం ధాన్యం కొనుగోలు సీజన్‌లో పెద్దూరు రెండు పడక గదుల ఇళ్ల సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు వరికుప్పను ఢీకొని కింద పడటంతో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు.

2022 యాసంగి సీజన్‌లో ఒడిశా వలస కార్మికుడు ద్విచక్రవాహనంపై వస్తూ రగుడు వద్ద వరికుప్పను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

స్థలం చూపించాలని అడిగాం

కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ స్థలం చూపించాలని ఇది వరకు రెవెన్యూ అధికారులను కోరాం. ప్రభుత్వ స్థలం చూపిస్తే అక్కడే కొనుగోలు కేంద్రాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

మీర్జా ఫసహత్ ఆలీ బేగ్, మెప్మా పీడీ

## మద్యం సీసా చూపిన సాక్ష్యం

హైదరాబాద్: పగిలిన మద్యం సీసా ఓ హంతకుడిని పట్టించింది. దాదాపు 20నెలలుగా పెండింగ్‌లో ఉన్న మహిళ హత్య కేసును ఛేదించింది. ఇదీ నేపథ్యం.. : ఏపీలోని నెల్లూరు జిల్లా ఓజిలి మండలానికి చెందిన చెంచు శైలజారెడ్డి(42) భర్త కృష్ణారెడ్డి, ఇద్దరు పిల్లలతో కలిసి 2011లో కందుకూరుకు వచ్చి.. దాసర్లపల్లిలోని అరుణ ఫాం హౌస్‌లో పనికి కుదిరారు. 2023 మార్చి 3న కృష్ణారెడ్డి, పిల్లలు బయటకు వెళ్లగా శైలజారెడ్డి ఒక్కరే ఉన్నారు. అప్పటికే ఆమెపై కన్నేసిన దాసర్లపల్లికే చెందిన ఉప్పుల శివకుమార్.. ఫాంహౌస్‌కు వెళ్లి ఆమెను బలవంతం చేయబోగా ఎదురు తిరిగింది. దీంతో కత్తితో ఆ మహిళను నరికి చంపాడు. తర్వాత పక్కనే మద్యం సీసా కనిపించగా తాగేందుకు



ప్రయత్నించాడు. సీసా చేజారి కింద పడి పగిలిపోయింది. దానిపై నిందితుడి వేలిముద్రలు పడ్డాయి. అనంతరం పరారయ్యాడు. వేలిముద్రలు మినహా ఘటనాస్థలిలో ఎలాంటి ఆధారాలు లభ్యమవ్వ లేదు. ఎప్పటికైనా నిందితుడు చిక్కుతాడనే ఉద్దేశంతో పోలీసులు మద్యం సీసా మీద వేలిముద్రలు భద్రపరిచారు. తాజాగా కొత్తగూడ మామిడి తోటలో వృద్ధ దంపతుల హత్య కేసులో శివకుమార్ నిందితుడని పోలీసులు సాంకేతిక ఆధారాలతో గుర్తించి అరెస్టు చేశారు. ఇక్కడ సేకరించిన వేలిముద్రల్ని.. శైలజారెడ్డి హత్య కేసులో నమోదైన వాటిని రెండింటినీ రాచకొండ ఫింగర్ ప్రింట్ యూనిట్‌తో పోల్చగా సరిపోలాయి. పోలీసులు రెండు కేసుల్లోనూ నిందితుడిగా చేర్చారు.

# ఒళ్లు హూనం.. గన్యానా.. డెంగీనా..?



హైదరాబాద్: చికున్ గన్యా బారినపడిన వారిలో కొత్త లక్షణాలు కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలోనూ ప్లేట్‌లెట్లు తగ్గిపోతుండటంతో తొలుత వైద్యులు డెంగీగా అనుమానంతో ఎన్ఎస్1, ఐజీజీ ఎలీసా పరీక్షలు చేస్తున్నారు. డెంగీ లేదని తేలాక చికున్‌గన్యాకు చికిత్స అందిస్తున్నారు. చిన్నపిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా కనబడుతోంది.

నిలోఫర్ ఆసుపత్రిలో ఓపీకి నిత్యం 5-6 వరకు ఈ తరహా కేసులు వస్తున్నాయి. పిల్లల్లోనూ కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటున్నాయి.

చికున్‌గన్యా సోకిన వారిలో కొత్తగా ముక్కు భాగంలో నల్లని ప్యాచ్‌లు వస్తున్నాయని వైద్యులు తెలిపారు. దీన్ని నిర్ధారించడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీసీఆర్ టెస్టులు అందుబాటులో లేవు. లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందిస్తున్నారు.

నగరంలో డెంగీ కంటే చికున్‌గన్యా కేసులు అధికంగా నమోదవుతున్నాయని వైద్యులు పేర్కొన్నారు. జ్వరం తగ్గినా.. చాలామందిలో 3-4 వారాలపాటు తీవ్ర కీళ్ల నొప్పులు ఉంటున్నాయి. ఇందుకు టైగర్‌దోమే కారణం.

డెంగీ, చికున్‌గన్యా వైరల్‌కు సంబంధించినవే. నొప్పులు తగ్గడానికి కొందరు పెయిన్‌కిల్లర్లు వాడుతున్నారు. వైద్యుల సూచనలు లేకుండా వాడొద్దని సూచిస్తున్నారు.

తీవ్రమైన జ్వరం వల్ల శరీరం త్వరగా డీహైడ్రేషన్ బారిన పడుతుంది. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల నిస్సత్తువ ఆవహించదు.

చికున్‌గన్యా లక్షణాలు...

హఠాత్తుగా 102 డిగ్రీలకుపైగా జ్వరం
తీవ్ర కీళ్ల, కండరాల నొప్పులు
నొప్పులతో కదలలేని పరిస్థితి
చేతుల మణికట్టు, కాళ్లు, మడమలు, భుజాల్లో నొప్పి
చర్మంపై దద్దుర్లు, ముఖంపై నల్లటి ప్యాచ్‌లు
జ్వరం తగ్గినా.. నెల రోజులపాటు కీళ్ల నొప్పులు
కొందరిలో ప్లేట్‌లెట్లు తగ్గిపోవడం.

డెంగీ ఇలా..

ఆకస్మిక అధిక జ్వరం(102 డిగ్రీలకుపైగా)
తీవ్ర తల, కళ్ల వెనుక నొప్పి
తీవ్రమైన కండరాల నొప్పి
అలసట, వికారం, వాంతులు, అతిసారం
జ్వరం ప్రారంభమైన రెండు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు :
తేలికపాటి రక్తస్రావం
ప్లాస్మా లీకేజీలు
కాళ్లు, కళ్ల కింద వాపులు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు


ఇంట్లో దోమలు లేకుండా చూసుకోవాలి. దోమ తెరలు వాడాలి.
కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. చెత్తాచెదారం తొలగించాలి.
పిల్లలను స్కూళ్లకు పంపేటప్పుడు చేతులు, కాళ్లు కప్పి ఉంచేలా సాక్సులు, ఇతర వస్త్రాలు ధరింపజేయాలి.
ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలి.

వైద్యులను సంప్రదించాలి

ప్రస్తుతం నగరంలో చికున్‌గన్యా ఎక్కువగా కనిపిస్తోంది. పిల్లలు కూడా ఈ జ్వరం బారిన పడుతున్నారు. 102 డిగ్రీలపైన జ్వరముంటే.. వైద్యులను సంప్రదించాలి. కొన్నిసార్లు చికున్‌గన్యాలో ప్లేట్‌లెట్ల తగ్గుదల ఉంటుంది. అంత ముప్పు కాదు. కానీ డెంగీలో ప్లేట్‌లెట్లు తగ్గడం, ప్లాస్మా లీకేజీలతో రోగి పరిస్థితి విషమంగా మారే ప్రమాదం ఉంటుంది. పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

డాక్టర్ ఉషారాణి, చిన్న పిల్లల వైద్యనిపుణులు, నిలోఫర్ ఆసుపత్రి

# పార్కింగ్ కష్టాలు తీరేలా.. నాంపల్లిలో 10 అంతస్తుల భవనం పూర్తిగా వాహనాలకే..




హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నగరంలోనే మొదటిసారిగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం(ఎంఎల్‌పీ) జనవరి 1 నుంచి జరిగే నుమాయిష్ నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పనుల పూర్తికి మరో రెండు నెలలు పడుతుందని నిర్మాణదారులు చెబుతున్నారు. నాంపల్లి కూడలిలో మెట్రోకి చెందిన అర ఎకరం స్థలంలో బహుళ సముదాయ నిర్మాణ పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మెస్సర్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ పీపీపీ విధానంలో రూ.80 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తోంది. మెట్రో భూమి కేటాయించగా.. ప్రైవేటు సంస్థ నిధులు వెచ్చించి నిర్మాణం చేపడుతోంది. 50 ఏళ్ల లీజ్ ఒప్పందమిది. కొవిడ్ తీవ్రత, రుణ లభ్యత సమస్యలు, గ్లోబల్ సప్లయ్ చైన్ అవాంతరాల వంటి కారణంగా ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్ర జాప్యమైంది. దాదాపు ఐదేళ్లు కావొస్తుంది. అందుబాటులోకి వస్తే నాంపల్లి చుట్టుపక్కల పార్కింగ్ తిప్పలు తీరుతాయని వాహనదారులు ఎదురుచూస్తున్నారు.

మూడు నిమిషాల్లోనే చేసేలా.. కింది అంతస్తులో వాహనాలు నిలిపేందుకు నాలుగు టెర్మినళ్లు ఏర్పాటు చేశారు. వాహనాన్ని నిలిపేందుకు టర్న్ టేబుల్‌పై వాహనం సరి. ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి వెళ్లి పార్కింగ్ చేస్తుంది.

ఆ తర్వాత ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తుకు తీసుకెళ్లి ఖాళీగా ఉన్న స్థలంలో పార్క్ చేస్తుంది. జర్మన్ సాంకేతికత ఇది. పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి చెల్లించిన పార్కింగ్ టికెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపగానే ట్రాన్స్‌ఫోర్టర్ షటిల్ ఆటోమెటిక్‌గా కారును వాహనదారుడికి అందజేస్తుంది. పార్కింగ్‌కోసం నిమిషం కంటే తక్కువ, తిరిగి పొందడానికి రెండు నిమిషాలు మాత్రమే పడుతుంది. రెండు సినిమా తెరలు కూడా... సముదాయంలో పై అంతస్తుల్లో రెండు సినిమా తెరలను సిద్ధం చేశారు. ఆహారశాలలు ఉంటాయి. ఇతర వాణిజ్య కార్యకలాపాలను లీజ్ పద్ధతిలో ఇస్తారు. వీటితో వచ్చే ఆదాయంతో సముదాయం నిర్వహణ, పెట్టుబడి ఖర్చును రాబట్టుకుంటారు.

# మత్తెక్కించే డ్రగ్స్.. మైమరిపించే మగువలు

హైదరాబాద్ : గచ్చిబౌలి పబ్‌లో డ్రగ్స్ తీసుకొని దొరికిన ప్రబుద్ధులు. మాదాపూర్ పబ్‌లో నవ్వుతూ పలకరించి జేబులు గుల్లచేసే అందమైన అమ్మాయిలు. బంజారాహిల్స్ బార్‌లో విదేశీ యువతుల నగ్న.. అర్ధనగ్న నృత్యాలు. నగరంలోని పలు పబ్‌లు, బార్‌లు వినోదం ముసుగులో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. కుర్రకారును ఆకట్టుకునేందుకు దేశ, విదేశాల నుంచి అందమైన మగువలను రప్పిస్తున్నాయి.. తమను తాము మరచిపోయే సింథటిక్ డ్రగ్స్‌ను రుచిచూపుతున్నాయి. పలుమార్లు టీజీన్యాబ్, పోలీసులు, ఆబ్కారీ యంత్రాంగం తరచూ దాడులు చేసి కేసులు నమోదుచేస్తున్నా.. నిర్వాహకులు తీరుమార్చుకోవట్లేదు. కాసులు ఎదజల్లి మళ్లీ అనుమతులు తెచ్చుకుంటున్నారు.

వలపు వల.. జేబుగుల్ల: మాదాపూర్, బంజారాహిల్స్.. గచ్చిబౌలి ఇలా ఖరీదైన ప్రాంతంలో పబ్‌కు ఒంటరిగా వెళ్లారా.. కాస్త 'రిలాక్స్' అవ్వాలనే సమయంలో పక్కనే కూర్చున్న అందమైన యువతి పలకరింపు వినిపిస్తుంది. చిరునవ్వుతో ఆరా తీస్తుంది. తన మిత్రుడు వస్తానని చెప్పి ఎక్కడో చిక్కాడంటూ నమ్మిస్తుంది. మాటలతో మాయచేసి సరదా సంభాషణ నుంచి వలపు వాకిట్లోకి తీసుకెళ్తుంది. ఛీర్స్.. డ్యాన్స్.. అపై రొమాన్స్ అంటూ ఊరించి.. తేరుకునేలోపు మాయమవుతుంది. పబ్ నిర్వాహకులు వేలల్లో బిల్లు చేతిలో పెట్టి అతని ముక్కు పిండి మరీ వసూలు చేస్తారు.. గత కొద్ది రోజులుగా నగరంలో కొనసాగుతున్న దందాపై పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా కొందరు యజమానులు తమ తీరు మార్చుకోవడం లేదు.. గోవా, ముంబయి తరహాలో నగరంలోని పలు పబ్‌లు ఇతర రాష్ట్రాల యువతులు, మహిళలకు ఉచిత ప్రవేశం కల్పించి.. కమీషన్ ఆశచూపి ఒంటరిపక్షులను యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

లెస్బాబ్ పబ్‌లో ఇదే తరహాలో నిర్వాహకులే అమ్మాయిలను తీసుకొచ్చి కస్టమర్లతో అధికంగా మద్యం తాగి బిల్లు పెరిగేలా దందా చేశారు. బంజారాహిల్స్‌లోనూ ఒక పబ్‌లో అమ్మాయిలను తీసుకొచ్చి దందా చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తాజాగా టాస్ పబ్ వ్యవహారంలోనూ ఇదే చోటుచేసుకొంది. దాదాపు 42 మందిలో 22మంది యువతులు, 20 మంది వివాహితులు



శనివారం రాత్రి నిర్వహించిన పోలీసుల దాడుల్లో దొరికారు. వీరిలో చాలామంది గృహిణులున్నారు.

ఆర్థిక అవసరాలకు పబ్‌కు వెళ్లి కాసింత సమయం అక్కడున్న వారిని తమ నృత్యాలతో రంజింపచేస్తున్నారు. వారితో కలిసి మద్యం సేవించి బిల్లును రెట్టింపు చేసి కమీషన్ తీసుకుంటున్నామంటూ పోలీసుల ఎదుట వాపోయారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా..

గోవా, ముంబయి, దిల్లీ, పుణె, బెంగళూరు వంటి నగరాల్లో కొన్ని పబ్బులు, బార్లలో యువతులు ప్రత్యేకంగా నృత్యాలు చేయడానికి వస్తుంటారు. రూ.2-3వేలు ఇచ్చే ఒప్పందంతో రప్పిస్తున్నారు. కొన్ని పబ్‌లు ముజ్రాపార్టీకి ముంబయినుంచి హిజ్రాలను రప్పిస్తున్నారు. విదేశీ యువతుల నృత్యాన్ని ఆస్వాదించేందుకు ప్రత్యేక రుసుం వసూలు చేస్తున్నారు.

నవ్వుకు చిక్కి కేసుల్లో ఇరుక్కోవద్దు:

పబ్‌కు వెళ్లే సమయంలో అక్కడి పరిస్థితులను ముందుగా తెలుసుకొని వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. పరిచయం లేని యువతులు, మహిళలు వచ్చి మాట, మందు కలిపితే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలంటున్నారు. గతంలో రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో మాదకద్రవ్యాల పేరుతో పోలీసులు దాడి చేసి దాదాపు 200 మందిని బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. బంజారాహిల్స్‌లోని ఆఫ్టర్ 9 పబ్‌లోనూ ఇదే తరహాలో 175 మందిని, టాస్ పబ్‌లో 142 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చీకటి కార్యకలాపాలకు పాల్పడే పబ్‌లు, బార్‌లను సీజ్ చేయమని నగర సీపీ సీవీ ఆనంద్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది.

# గూగుల్‌లో వేట.. నేరగాళ్ల ఆట

హైదరాబాద్: ఎలక్ట్రానిక్ వస్తువు చెడిపోయిందని కంపెనీ కస్టమర్ కేర్ కోసం గూగుల్‌లో వెతకగానే ఓ నంబరు ప్రత్యక్షమవుతుంది.. ఫోన్ చేశాక అవతలి వ్యక్తులు చెప్పినట్లు చేశామా ఖాతా ఖాళీ.. బ్యాంకు లావాదేవీపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేద్దామని ప్రయత్నిస్తే నకిలీ వెబ్‌సైట్ దర్శనమిస్తుంది. తనిఖీ చేసుకోకుండా వివరాలు నమోదుచేస్తే ఖాతా గుల్లయినట్టే.. సైబర్ నేరస్థులు కేవలం పౌరులనే కాదు గూగుల్‌ని ఏమార్చి రూ.వందల కోట్లు కొల్లగొట్టేస్తున్నారు.

ఇదీ నేరగాళ్ల మంత్రం..గూగుల్, ఇతర సెర్చింజన్ ఏదైనా వెబ్‌సైట్, సమాచారం కోసం వెతికినప్పుడు ఎక్కువ మంది వీక్షించే వెబ్‌సైట్లు, సంబంధించిన ప్రకటనలు తెరపై ప్రత్యక్షమవుతాయి. సైబర్ ముఠాలు దీన్ని వాళ్లకు అనుకులంగా మార్చుకుంటున్నాయి. అసలైన వెబ్‌సైట్లకు బదులు తాము సృష్టించిన నకిలీ వెబ్‌సైట్ ప్రముఖంగా కనిపించేలా చేస్తున్నారు. సంస్థ పేరులో ఏదో ఒక అక్షరం తేడాతో ఈ వెబ్‌సైట్ ఉంటుంది. గూగుల్ అల్గారిథమ్ ప్రకారం.. అసలు వెబ్‌సైట్ కోసం వెతికినప్పుడు ఎక్కువ వీక్షణలుండే నకిలీ వెబ్‌సైట్ ముందు ప్రత్యక్షమవుతుంది. ఎక్కువ మంది అసలు, నకిలీ వెబ్‌సైట్లకు తేడా గుర్తించకుండా అందులోని నకిలీ కస్టమర్ కేర్ నంబర్లకు ఫోన్ చేస్తుంటారు. కొందరు వెబ్‌సైట్లకు వెళ్లకుండా నేరుగా ఆయా కంపెనీల కస్టమర్ కేర్ నంబరు కోసం వెతుకుతారు. ఇలా వెతికినప్పుడు తెరపై 90




శాతం నకిలీ కాల్‌సెంటర్ల నంబర్లు వస్తుంటాయి. ఈ కాల్స్‌ను స్వీకరించే నేరగాళ్లు నమ్మకంగా మాట్లాడుతూ వివరాలు సేకరించి డబ్బు కొట్టేస్తున్నారు.

10 శాతం మోసాలివే..ప్రస్తుతం 185 రకాల సైబర్ మోసాలు జరుగుతున్నాయి. ఇందులో క్రెడిట్, డెబిట్ కార్డు, కస్టమర్ కేర్, తక్కువ ధరకే విలువైన వస్తువులు తదితర మోసాలు దాదాపు 10 శాతం వరకూ ఉంటున్నాయి. వెబ్‌సైట్లో అంతా సవ్యంగానే కనిపించినా వివరాలు నమోదు చేయించి వేర్వేరు ఫీజుల పేరుతో డబ్బు వసూలు చేస్తారు. తక్కువ ధరకే వస్తువులంటూ ప్రకటనలో బోల్తా కొట్టించడం మరో మోసం. మనం ఫర్నీచర్ కోసం వెతికినప్పుడు తెరపై రూ.2 వేలకే మంచి ఖరీదైన ఫర్నీచర్, రూ.10 వేలకే ఫ్రిజ్ వంటి ప్రకటనలు వస్తాయి. పొరపాటున వీటి మీద క్లిక్ చేస్తే నేరుగా నకిలీ వెబ్‌సైట్లోకి తీసుకెళ్తుంది. వస్తువు డెలివరీ చేయడానికి డబ్బు కట్టాలంటూ మోసగిస్తారు. నకిలీ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినప్పుడు ముందస్తు డిపాజిట్ కట్టాలనో.. లేక లింకు పంపిస్తే దాన్ని క్లిక్ చేయాలని చెబుతారు. ఈ లింకు క్లిక్ చేస్తే ఎనీ డెస్క్ వంటి యాప్‌లు డౌన్‌లోడ్ అయి ఫోన్ మొత్తం నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంది.

# అలంకారప్రాయంగా బస్తీ దవాఖానా

వేములవాడ : పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా అలంకారప్రాయంగా మారింది. వేములవాడలోని రాజన్న దర్శనానికి వచ్చే భక్తులతోపాటు జాత్రగౌండ్ ప్రాంతంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏడాదిన్నర క్రితం ఆలయ లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో దీనిని ఏర్పాటు చేశారు. అన్ని వసతులు కల్పించి రెండు పడకలతో ప్రారంభించారు. ఇందులో ఒక వైద్యుడు, స్టాఫ్‌నర్స్, హెల్పర్‌ను నియమించారు. ఆసుపత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి నామమాత్రంగానే రోగులు వస్తున్నారు. స్థానికులు మాత్రం రక్తపోటు, మధుమేహం, దగ్గు వంటి వాటికి మందుల కోసం వస్తున్నారు.

అరకొరగా మందులు

ఆసుపత్రికి వచ్చే రోగులే తక్కువగా ఉంటే మందులు కూడా అరకొరగానే సరఫరా అవుతున్నాయి.

ఏడాదికి లక్ష రూపాయల బడ్జెట్ పెట్టినప్పటికీ నిధులు విడుదల కావడం లేదు. మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ఒక వేళ వచ్చినా పూర్తి స్థాయిలో రావడం లేదు.

ఆరు నెలల నుంచి అరకొరగానే మందులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఆసుపత్రి ముందు భక్తులు, ఇతరులు వాహనాలు నిలుపుతున్నారు. దీనికి ఇరువైపులా రహదారులను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు.



వారంలో ఈ రోజుల్లోనే...వారంలో శనివారం ఆసుపత్రికి సెలవు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యుడు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. మిగతా రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంటుంది. రాజన్న ఆలయానికి రాత్రింబళ్లు భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం వేములవాడకు వచ్చినవారు ఇక్కడ వసతి గదుల్లో బస చేసి సోమవారం స్వామివారిని దర్శించుకుంటారు. రాత్రి వేళ ఏదేని వైద్య సహాయం అవసరమైతే భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 24 గంటలూ వైద్య సేవలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని వైద్య సేవలను మరింత విస్తృత పరచాల్సిన అవసరం ఉంది.

ఉన్న మందులనే ఇస్తున్నాం

ఆసుపత్రికి పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు. అరకొరగా సరఫరా అవుతున్నాయి. సిబ్బంది కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. సోమ, శుక్రవారాల్లో దాదాపు 20 మంది వస్తున్నారు. రవీందర్, వైద్యుడు బస్తీ దవాఖానా, వేములవాడ




నేమకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు తమ గ్రామానికి రావడంతో నేమకల్లు వాసులు ఆనందం వ్యక్తం చేశారు.




ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మహాయుతి కూటమి ప్రభుత్వ ఏర్పాటుపై మాత్రం ఏకాభిప్రాయానికి రాలేకపోతోంది. తదుపరి సీఎం, శాఖల కేటాయింపులపై పార్టీల మధ్య చర్చలు ఇంకా కొలిక్కి రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. మరోవైపు, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే.. కూటమి ముఖ్యనేతల భేటీని రద్దు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల వేళ శివసేన నేత సంజయ్ శిర్సాట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వంలో శిందేను పక్కనబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. “శిందే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం వల్ల ఈ ఎన్నికల్లో భాజపాకు ప్రయోజ నం చేకూరింది. కొన్ని పథకాలకు ఎన్‌సీపీ అభ్యంతరం చెప్పినప్పటికీ శిందే వాటిపై ముందుకెళ్లారు. అవన్నీ ఎన్నికల్లో కూటమికి ఓట్లు కురిపించినవే. సాధారణంగా హోంశాఖను డిప్యూటీ సీఎంకే ఇస్తారు. ఇప్పుడు భాజపా ముఖ్యమంత్రి పదవి తీసుకుంటే.. హోంశాఖను శివసే నకు ఇవ్వాలి. అలా కాదని సీఎం వద్దే ఉంచుకోవడం సరికాదు. కొత్త ప్రభుత్వంలో శిందేకు కీలక శాఖలు ఇవ్వకుండా పక్కనబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది” అని సంజయ్ శిర్సాట్ ఆరోపించారు.

**శిందే అసంతృప్తితో ఉన్నారా..?...** మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై దిల్లీలో మంతనాలు జరిగినప్పటికీ ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇటీవల కేంద్రహోంమంత్రి అమిత్ షాతో ఏక్‌నాథ్ శిందే భేటీ అయ్యారు. ‘సీఎం ఎవరనే దానిపై భాజపా తీసుకునే నిర్ణయానికి పూర్తి మద్దతు ఇస్తా. ముంబయిలో కూటమి నేతల మధ్య చర్చ జరిగిన తర్వాత రెండు, మూడు రోజుల్లో దీనిపై నిర్ణయాన్ని ప్రకటిస్తాం” అని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి వెల్లడించారు. అయితే, ఆ తర్వాత కొన్ని గంటలకే ఆ సమావేశాన్ని రద్దు చేసి సొంతూరుకు వెళ్లిపోయారు. దీంతో సీఎం ఎంపిక, శాఖల కేటాయింపుల విషయంలో కూటమి నిర్ణయంతో ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, ఆయన అనారోగ్య సమస్యలతో ఊరికి వెళ్లినట్లు మరికొందరు నేతలు చెబుతున్నారు.

**24 గంటల్లో కీలక ప్రకటన..?...** మరోవైపు, తన భవిష్యత్తు కార్యాచరణపై శిందే 24 గంటల్లో కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయన మహాయుతి కూటమితో కలిసే ఉంటారా? లేదా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇదిలాఉండగా.. కొత్త ముఖ్యమంత్రిగా భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతున్నా.. రేసులో కొత్తగా మురళీధర్ మోహోల్ పేరు తెర పైకి వచ్చింది. భాజపా పుణె ఎంపీ అయిన మురళీధర్ ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు.

## అదానీ వ్యవహారం.. విదేశాంగ శాఖ చెప్పింది కరెక్టే: కాంగ్రెస్ వ్యంగ్యాస్త్రాలు

దిల్లీ: అదానీ, దాని అనుబంధ సంస్థలు.. సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు పెద్దఎత్తున లంచాలు ఆఫర్ చేశారన్న ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదవడం ఇటీవల సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆ వ్యవహారంపై భారత విదేశాంగ శాఖ నుంచి వచ్చిన స్పందనపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. గురువారం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. ‘ఇది ప్రైవేటు సంస్థలు, కొంతమంది వ్యక్తులు, అమెరికా న్యాయశాఖకు సంబంధించిన అంశం. ఇటువంటి కేసుల్లో అనుసరించాల్సిన విధానాలు, చట్టపరమైన మార్గాలు స్పష్టంగా ఉన్నాయి. అవి వాటిని అనుసరిస్తాయని విశ్వసిస్తున్నాం. ఇప్పటివరకు భారత సర్కారుకు ఎటువంటి సంబంధం లేని ఈ అంశంపై అమెరికా ప్రభుత్వంతో ఎటువంటి చర్చలు జరపలేదు” అని తెలిపారు. అలాగే అదానీ కేసులో భారత్‌కు అమెరికా సమన్లు లేదా వారెంటు ఇచ్చిందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. భారత్‌కు అటువంటి విజ్ఞప్తి ఏదీ రాలేదన్నారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. “అదానీ గ్రూప్ వ్యవహారంలో అమెరికా దర్యాప్తులో భారత ప్రభుత్వం భాగం కాదని విదేశాంగ శాఖ ప్రతినిధి చాలా స్పష్టంగా చెప్పారు. ఈ ప్రభుత్వం తనకు తాను దర్యాప్తులో ఎలా భాగం అవుతుందిలే..?” అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రభుత్వంపైనే విమర్శలు వచ్చాయనే ఉద్దేశంలో ఈ విమర్శలు చేశారు.

## విజయనగరం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి

భోగాపురం : విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి అవతలి రోడ్డు వైపు దూసుకెళ్లి బోల్తాపడింది. అటుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను శ్రీకాకుళానికి చెందిన ద్రవిడ కౌశిక్, వడ్డే అభినవ్, మణిమాల, వాహన డ్రైవర్ జయేశ్‌గా పోలీసులు గుర్తించారు.



## నర్సింగ్ విద్యార్థుల బస్సులో మంటలు..



చెరుకుపల్లి: బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడవల్లి వద్ద జాతీయ రహదారిపై రేపల్లె ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థలకు చెందిన బస్సు దగ్ధమైంది. నర్సింగ్ విద్యార్థులను తీసుకువెళ్తున్న కళాశాల బస్సులో విద్యుదాఘాతం కారణంగా మంటలు చెలరేగడంతో పూర్తిగా కాలిపోయింది. ముందుగానే పొగను గుర్తించి విద్యార్థులు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

గుంటూరులో నర్సింగ్ విద్యార్థులకు పరీక్ష ఉండటంతో వారిని తీసుకువెళ్తుండగా బస్సు మార్గమధ్యలో ప్రమాదానికి గురైంది. స్థానికులు స్పందించి నీళ్లు చల్లారు. రేపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

## ఏపీలో ఒకరోజు ముందుగానే పెన్షన్.. లబ్ధిదారుల్లో ఆనందం

అమరావతి, నవంబర్ 30: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ ఫించన్ల పంపిణీ (%ఖ్రా ావఅంఱశీఅ%) జోరుగా సాగుతోంది. రేపు(డిసెంబర్ 1) ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఫించన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఈరోజు ఉదయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఫించన్ల పంపిణీ కార్యక్రమం షురూ అయ్యింది. ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు కూడా ఫించన్ల పంపిణీలో పాల్గొని లబ్దిదారులకు ఫించన్లను అందజేస్తున్నారు. పలు చోట్ల వర్షాలు పడుతున్నప్పటికీ ఫించన్ల పంపిణీ మాత్రం ఆగడం లేదు. జోరు వానలోనూ నేతలు పెన్షన్లను లబ్దిదారులకు అందజేస్తున్నారు. డిసెంబర్ 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అనుకున్న విధంగానే ఈరోజు పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, ఆయా వ్యాధుల చేత బాధింపబడేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ముందస్తు ఏర్పాట్లను ప్రభుత్వం చేసింది. అయితే శనివారం పెన్షన్ పొందని వారికి డిసెంబరు 2న అందజేయనున్నారు.


**జోరువానలో...** అనకాపల్లి జిల్లా నర్సీ పట్నంలో ఫించన్ పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. జోరువానలోనూ స్పీకర్ పెన్షన్‌ను పంపిణీ చేశారు. అనకాపల్లి జిల్లా, గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో ఒకరోజు ముందుగా ప్రభుత్వం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న పాల్గొని లబ్దిదారులకు డబ్బులు అందజేశారు.




చెన్నై: బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా మారడంతో తీవ్ర వాయుగుండం తుపానుగా మారింది. పుదుచ్చేరి, తమిళనాడు తీరాల వైపు బలంగా దూసుకొస్తున్న ఈ ‘ఫెయింజల్’ తుపాను.. మరికొన్ని గంటల్లో తీరాన్ని తాకే అవకాశం ఉంది. దీంతో తమిళనాడు వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని చెన్నైలో ఇప్పటికే పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాల కారణంగా విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తుండటంతో శనివారం సాయంత్రం 5 గంటల వరకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే శుక్రవారం నుంచి విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు పలు ఎయిర్‌లైన్లు ప్రకటించాయి. కొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. తాజాగా ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను నిలిపివేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం నాటికి ఈ తుపాను కారైకాల్, మహాబలిపురం మధ్య తీరం దాటొచ్చని చెన్నై వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. తీరం దాటేటప్పుడూ ఉద్ధృతంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. భీకర గాలులు, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే సహాయక శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. తుపానును ఎదుర్కొనేందుకు సంసిద్ధత చర్యలను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అటు పుదుచ్చేరిలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. పలు ప్రాంతాల్లో నీరు చేరింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రభుత్వం సూచించింది.

# అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి..

## ‘ఫెయింజల్’ తుపానుపై చంద్రబాబు సమీక్ష



అమరావతి: ‘ఫెయింజల్’ తుపానుపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష చేపట్టారు. విపత్తు నిర్వహణ శాఖ, కలెక్టర్లు, సీఎంవో, రియల్ టైం గవర్నెన్స్ అధికారులతో చర్చించారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం శుక్రవారం మధ్యాహ్నానికి తుపానుగా మారినట్లు భారత వాతావరణశాఖ పేర్కొంది. దీనికి ఫెయింజల్‌గా నామకరణం చేశారు. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మధ్యాహ్నానికి కారైకాల్ (పుదుచ్చేరి), మహాబలిపురం (తమిళనాడు) మధ్యలో తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. ఈ కారణంగా ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ఇన్‌ఛార్జి డైరెక్టర్ కేవీఎస్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో ఆకస్మికంగా వరదలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు.




తిరుమల: శ్రీవారి ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని తితిదే నిర్ణయించింది. గత కొంతకాలంగా కొందరు రాజకీయ నాయకులు దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని తితిదే బోర్డు ఇటీవల తీర్మానించింది. దీన్ని తాజాగా అమలులోకి తీసుకువచ్చింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

## స్థానికులకు డిసెంబర్ 3న తిరుమల శ్రీవారి దర్శనం: తితిదే

తిరుమల: తిరుపతిలోని స్థానికులకు తిరుమల శ్రీనివాసుడి దర్శనాన్ని తితిదే ధర్మకర్తల మండలి ఇటీవల పునరుద్ధరించింది. ఈక్రమంలో డిసెంబర్ 1న తిరుపతి మహతి ఆడిటోరియంలో, తిరుమలలోని బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేయనున్నారు. తితిదే ధర్మకర్తల మండలి నవంబర్ 18న జరిగిన తొలి సమావేశంలో ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డిసెంబర్ 3న (మొదటి మంగళవారం) స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు తితిదే ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలకు చెందిన స్థానికులు తమ ఆధార్ ఒరిజినల్ కార్డును చూపించి టోకెన్లు పొందవచ్చని తితిదే తెలిపింది.




వైఎస్సార్ జిల్లాలోని ఆర్టీపీపీ బూడిద తరలింపుపై జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి వర్గీయుల మధ్య తలెత్తిన వివాదం గురించి పురందేశ్వరిని మీడియా ప్రశ్నించింది.

దీంతో ఇప్పటికే సీఎం చంద్రబాబు వారిద్దరినీ పిలిచారని.. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సీఎంకు తన వివరణను ఇచ్చారని చెప్పారు. ఇది ఆ ఇద్దరి నాయకుల మధ్య వ్యాపార సంబంధ అంశమన్నారు.

రాష్ట్రానికి తీసుకురావాల్సిన నిధుల గురించి కేంద్రంతో చర్చిస్తున్నామని.. పార్లమెంటు సమావేశాల్లోనే పలు అభివృద్ధి అంశాలపైనా మాట్లాడతామని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాజమహేంద్రవరం నియోజకవర్గానికి రూ.98 కోట్లను అఖండగోదావరి అభివృద్ధికి కేటాయించిందని అన్నారు.

## జ్యోతి పూర్వాజ్ కిల్లింగ్ లుక్.. ఏదో పెద్ద విషయమే చెప్పిందే!

తెలుగు బుల్లితెర ప్రియుల్లో జగతి మేడమ్ అలియాస్ జ్యోతి కోసం బహుశా తెలియని వారు ఉండరని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. కన్నడ బ్యూటీ అయిన జ్యోతి.. గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యారు. తన యాక్టింగ్ తో ఎందరో మనసుల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. సీరియల్ లో అటు తల్లి, ఇటు టీచర్ రోల్స్ లో తన నేచురల్ యాక్టింగ్ తో మెప్పించిన జ్యోతి.. సడెన్ గా ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దీంతో ఆమె పాత్రను నిర్వాహకులు చంపేశారు. సీరియల్ నుంచి బయటకొచ్చి.. సినిమాలు, వెబ్ సిరీసులతో జ్యోతి బిజీ అయిపోయారు. సోషల్ మీడియాలో కూడా ఫుల్ గా యాక్టివ్ మోడ్ లోకి వచ్చేశారు. సీరియల్ లో సంప్రదాయంగా కనిపించిన జ్యోతి.. నెట్టింట మాత్రం ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తుంటారు. నెవ్వర్ బిఫోర్ అనేలా గ్లామర్ షో చేస్తుంటారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను పోస్ట్ చేస్తుంటారు. తన స్కిన్ తో అందరినీ మైమరిపిస్తుంటారు. తన అందాల జాతరతో



ఫిదా చేస్తుంటారు. కుర్రాళ్ల మైండ్ బ్లాక్ చేస్తుంటారు. గ్లామర్ షో అంటూ ఇలా ఉండాలనేలా సందడి చేస్తుంటారు. తన పిక్స్ తో ఎప్పటికప్పుడు ట్రెండింగ్ లో నిలుస్తుంటారు. తాజాగా అదిరిపోయే పిక్ ను పోస్ట్ చేశారు. దాంతోపాటు ఓ విషయాన్ని కూడా షేర్ చేసుకున్నారు. పిక్ లో గోల్డెన్ కలర్ మోడ్రన్ డ్రెస్ తో జ్యోతి వేరే లెవెల్ లో ఉన్నారు. తన చూపుతో అలా ఫ్లాట్ చేసేశారు. తన అందచందాలతో.. కేక పుట్టించే లుక్ తో క్లీన్ బౌల్డ్ చేసేశారు. "కొన్నిసార్లు మీ జీవితాన్ని మార్చే ఏడాది పొందడానికి పదేళ్లు పడుతుంది. లక్ష్యాలు, ఆలోచనల గురించి మాట్లాడే వ్యక్తులతో ఉండండి. ఎవరైనా మిమ్మల్ని కిందకు దింపడానికి ప్రయత్నించినప్పుడు విశ్వాసం నిశ్శబ్దంగా ఉందని గుర్తుంచుకోండి" అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం జ్యోతి పోస్ట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అయితే ఇప్పుడు పలు సిరీసులతో పాటు తన భర్త, డైరెక్టర్ పూర్వాజ్ దర్శకత్వంలో కిల్లర్ సినిమాలో నటిస్తున్నారు. రీసెంట్ గా వచ్చిన కిల్లర్ మూవీ టైటిల్ పోస్టర్ తో అందరినీ మెప్పించారు. పూర్వాజ్ ను కొద్ది రోజుల క్రితం జ్యోతి రెండో పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే.

## మయోసైటిస్‌తో సాహసోపేతమైన జర్నీపై సమంత

వ్యక్తిగతంగా ఒడిదుడుకులు ఎదుర్కొన్నా సమంతా రూత్ ప్రభు సాహసోపేతమైన ప్రయాణం స్ఫూర్తిని నింపుతోంది. నాగ చైతన్యతో విడాకుల తర్వాత సామ్ ఊహించని కొత్త సవాళ్లను ఎదుర్కొంది. ఇటీవల గలాట్టా ఇండియా ఇంటర్వ్యూలో విడాకులపై సామాజిక తీర్పు, కళంకం, భావోద్వేగాల గురించి సమంతా మాట్లాడారు. ఓ స్త్రీ విడాకులు తీసుకుంటే, దానితో పాటే చాలా అవమానం, కళంకం అంటగడతారు. నన్ను సెకంలి హ్యాంలి.. అని.. యూజ్డ్ అని లెక్కలేనన్ని కామెంట్లు చేసారు. వృథా జీవితం.. అపరాధం అంటూ అవమానించి సమాజం ఒక మూలకు నెట్టివేస్తుంది. ఇది కుటుంబాలకు కూడా చాలా కష్టం... అని తన ఆవేదనను వ్యక్తం చేసారు. వ్యక్తిగత జీవితాల్లో పురుషుల కంటే స్త్రీలు ప్రజల నుంచి కఠినమైన పరిశీలనను ఎదుర్కొంటారని అన్నారు. కొన్నేళ్లుగా నేను



నా జీవితం గురించి అవాస్తవ కథనాలను చదివాను. చాలా సార్లు నేను మాట్లాడాలని, నిజం చెప్పాలని అనుకున్నాను.. కానీ వెనక్కి తగ్గాను. నేను నాతో నేను మాట్లాడుకున్నాను. కథను మీ వైపు చెప్పడం ద్వారా మీరు ఏం పొందాలనుకుంటున్నారు? మద్దతు ఒకవైపే ఉండవచ్చు.. ఈరోజు మీకు మద్దతిచ్చే వ్యక్తులు రేపు చిన్న కారణంతో మీకు వ్యతిరేకంగా మారవచ్చు.. అని కూడా సమంత ఇంటర్వ్యూలో అన్నారు. నేను విడాకులు తీసుకున్నాను.

నా జీవితం ఒక అద్భుత కథ కాదు కానీ దాని అర్థం నేను ఒక మూలన కూర్చుని ఏడుస్తూ ఉంటాను అని కాదు. ఇది నా మార్గం.. కానీ నా జీవితం ఇక్కడితో ముగియదు అని కూడా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సమంత వ్యక్తిగతంగా చాలా కోలుకుని వృత్తిపరంగానూ దూసుకువెళుతున్న సంగతి తెలిసిందే.

**మయోసైటిస్ అలా మొదలైంది:** మరో ఇంటర్వ్యూలో మయోసైటిస్ గురించి మాట్లాడుతూ.. ఈ రుగ్మత ఎలా మొదలైందో ఆరంభం అర్థం కాలేదని అన్నారు. కరణ్ జోహార్ తో %-%కాఫీ విత్ కరణ్%-% షోని పూర్తి చేసుకుని హైదరాబాద్ కి వచ్చేశానని, ఖుషి షూటింగుకి వచ్చానని సమంత అన్నారు. కానీ అక్కడ నీరసంగా అనిపించింది. శరీరం పని చేయనట్టు షట్ డౌన్ అయిపోయింది. ఆ తర్వాతా ఆ సమస్యను పెద్దగా ఎదుర్కొన్నాను. నెమ్మదిగా మయోసైటిస్ అని తెలిసింది అని సమంత తెలిపారు. ఏం జరుగుతుందో అర్థం కాలేదు.. కోలుకోవడానికి చాలా సమయం పడుతోంది. ఇంకొంత కాలం పట్టొచ్చని కూడా సమంత అన్నారు.




## కిక్కిచ్చేలా పుష్ప రాజ్ - శ్రీవల్లి స్టైలిష్ పోజ్




స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ముంబైలో పుష్ప 2 ది రూల్ ప్రమోషన్ ఈవెంట్‌లో అందరి దృష్టిని ఆకర్షించారు. బ్లాక్ కలర్ ఎలిగెంట్ డ్రెస్‌లో ఇద్దరూ స్టేజీపై ఇచ్చిన ఈ స్టైలిష్ పోజ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "పుష్ప రాజ్ అండ్ శ్రీవల్లి" అని అల్లు అర్జున్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ ఫోటోపై అభిమానులు పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. సినిమా ప్రమోషన్‌లో ఇలాంటి క్యాజువల్ అండ్ స్టైలిష్ ఎలిమెంట్స్‌ను జోడించడం హైలెట్ గా నిలుస్తోంది. పుష్ప 2 ది రూల్ పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మొదటి భాగం "పుష్ప: ది రైజ్" కంటే ఈ సీక్వెల్ మరింత గ్రాండ్‌గా ఉండబోతోందని ట్రైలర్‌లు, పోస్టర్స్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. సినిమాలో అల్లు అర్జున్ పుష్ప రాజ్‌గా మరింత పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతుండగా, రష్మిక శ్రీవల్లి పాత్రలో తన ప్రత్యేకతను చూపనున్నారు. ఫహద్ ఫాసిల్ కూడా మరోసారి సీరియస్ పాత్రలో నటిస్తున్నారు. పుష్ప 2 ప్రమోషన్స్ మొదటి నుంచే వినూత్నంగా ఉన్నాయి. పట్నాలో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఉత్తరాదిలో కూడా సినిమాపై క్రేజ్‌ను పెంచింది. అలాగే ముంబై ఈవెంట్ ద్వారా బాలీవుడ్ ఫ్యాన్స్‌ను టార్గెట్ చేస్తూ, సినిమా పాన్-ఇండియా రేంజ్‌ను మరోసారి రుజువు చేశారు. బన్ని మరియు రష్మిక వేసుకున్న డ్రెస్సింగ్ స్టైల్ నుండి స్టేజ్ పై ఇచ్చిన పోజ్ వరకు ప్రతీది ట్రెండింగ్ అవుతోంది. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్, ముత్తంశెట్టి మీడియా బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, సామ్ సిఎస్ కూడా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లో కీలకంగా వ్యవహరించబోతున్నారు. పుష్ప 2 డిసెంబర్ 5న విడుదల కానుండగా, ఇది ఈ ఏడాది చివరి బ్లాక్‌బస్టర్‌గా నిలిచే అవకాశాలున్నాయి.

అల్లు అర్జున్ అభిమానులు సోషల్ మీడియాలో తమ అభిమానాన్ని చూపుతూ, సినిమా విడుదలకు కౌంట్‌డౌన్ మొదలుపెట్టారు. "పుష్ప 2" తో బన్నీ తన రేంజ్‌ను మరింత పెంచుతారని అందరూ విశ్వసిస్తున్నారు. సినిమా ప్రమోషన్లకు మరో స్థాయికి తీసుకురావడంలో పుష్ప టీమ్ మరోసారి ముందంజలో నిలిచిందని చెప్పాలి. ఇటువంటి వినూత్న ప్రమోషన్ స్ట్రాటజీస్, స్టైలిష్ ఎలిమెంట్స్ పుష్ప 2ను పాన్ ఇండియా స్థాయిలో పెద్ద విజయంగా మార్చే అవకాశాలు చూపిస్తున్నాయి. ఇక డిసెంబర్ 5న థియేటర్లలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చాక, ఇది ఏ స్థాయిలో ప్రభావం చూపుతుందో చూడాలి.


## సత్యదేవ్ 'జీబ్రా' - గుడ్ న్యూస్ ఏమిటంటే..



సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'జీబ్రా' ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటూ, బాక్సాఫీస్ వద్ద తనదైన గుర్తింపు తెచ్చుకుంటోంది. విడుదలైన తొలి రోజు నుంచినే ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుండగా, ఈ వారం సినిమా థియేటర్లలో మరింత ఉత్సాహంగా ప్రదర్శితమవుతోంది. డిఫరెంట్ కంటెంట్ ఉన్న సినిమాలను చేసే సత్యదేవ్ మరోసారి ప్రేక్షకుల నమ్మకాన్ని గెలుచుకున్నాడు. ప్రేక్షకుల ప్రేమతో పాటు విమర్శకుల ప్రశంసలతో ఈ చిత్రం ముందుకు సాగుతుండగా, మొదట కొన్ని కారణాల వలన పూర్తి స్థాయిలో తన వసూళ్ల సామర్థ్యాన్ని సాధించలేకపోయింది. ముఖ్యంగా, 'జీబ్రా' విడుదల సమయంలోనే 'అమరన్', 'లక్కీ భాస్కర్' వంటి పెద్ద చిత్రాలు థియేటర్ స్క్రీన్లను ఆక్రమించడం, ఈ చిత్రానికి పరిమిత థియేటర్ల కేటాయింపుకు కారణమైంది. అయితే, ఈ పరిస్థితే త్వరలో మారనుంది. 'అమరన్' మరియు 'లక్కీ భాస్కర్' వంటి సినిమాలు ఈ వీకెండ్ నుంచి ఓటీటీలోకి అడుగుపెట్టనున్నాయి. దీంతో థియేటర్లలో స్క్రీన్ స్పేస్ ఎక్కువగా అందుబాటులోకి రానుండటంతో, 'జీబ్రా' మరింత భారీగా ప్రేక్షకులకు చేరువయ్యే అవకాశం ఉంది. ఈ మార్పు సినిమాకు కొత్త ఊపును అందించనుంది. డిఫరెంట్ కథ, అద్భుతమైన నటన, దృఢమైన కథనంతో రూపొందిన ఈ సినిమా ప్రస్తుతం వేరే స్థాయిలో చర్చకు దారి తీస్తోంది. ప్రదర్శన రోజులు పెరుగుతున్న కొద్దీ 'జీబ్రా'కు వసూళ్లు కూడా స్థిరంగా పెరుగుతున్నాయి. సత్యదేవ్ ఈ చిత్రంలో తన శక్తివంతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, ఈ సినిమాను తన కెరీర్‌లో మరో ముఖ్యమైన విజయంగా మార్చుకున్నాడు. ఈ వారం చివరిలో థియేటర్లలో 'జీబ్రా'కు మరింత స్క్రీన్లు లభించడం, ఫుట్ ఫాల్స్ ను పెంచుతుందని పంపిణీదారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, ఈ చిత్రం కథ, దాని భావోద్వేగపూరిత సన్నివేశాలు, ప్రేక్షకులకు మరింత ఆకర్షణీయంగా మారుతున్నాయి. ఇక మొదటి వారం తరువాత, 'జీబ్రా' కొత్త ఉత్సాహాన్ని సొంతం చేసుకుంటూ, బాక్సాఫీస్ వద్ద తన స్థాయిని పెంచుకునే అవకాశం కనిపిస్తోంది. సత్యదేవ్ నటన, మేకర్స్ శ్రమ, ప్రేక్షకుల స్పందన కలసి ఈ చిత్రాన్ని సీజన్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలబెట్టే అవకాశం ఉంది. చూస్తుంటే సత్యదేవ్ కెరీర్ లో ఈ సినిమా బెస్ట్ కలెక్షన్లు అందుకున్న సినిమాగా నిలిచే అవకాశం ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

## హీటెక్కించే గ్లామర్ తో రష్మిక బ్లాక్ మ్యాజిక్

పుష్ప 2 ప్రెస్ మీట్ సందర్భంగా ముంబై వేదికగా జరిగిన ఈవెంట్‌లో నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన గ్లామర్ లుక్‌తో అందరి చూపులను తిప్పుకోనివ్వలేదు. బ్లాక్ డ్రెస్‌లో కనిపించిన రష్మిక.. తన చిరునవ్వుతో అందరిని ఆకట్టుకుంది. ఈ ప్రెస్ మీట్ లో రష్మిక 'పుష్ప 2' ప్రమోషన్లలో భాగంగా చిత్త యూనిట్ తో పాటు రష్మిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక తన అనుభవాలను పంచుకుంటూ సినిమా గురించి ఆసక్తికర విషయాలు తెలిపారు. 'పుష్ప 2: ది రూల్' డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అల్లు అర్జున్, రష్మిక మందన్న జోడీని మళ్లీ తెరపై చూడటానికి ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా లెవల్‌లో భారీగా రిలీజ్ కానుంది. ఇక ప్రమోషన్లలో భాగంగా ముంబైలో ఏర్పాటు చేసిన ఐకానిక్ ప్రెస్ మీట్‌లో చిత్రయూనిట్ హైప్ వేరే లెవెల్‌లో ఉందని చెప్పాలి. ఈ




ఈవెంట్ లో రష్మిక తన సింప్లిసిటీతో పాటు స్టైలిష్ లుక్‌ను ప్రదర్శించి మీడియా, అభిమానులను అలరించింది. అల్లు అర్జున్, రష్మిక జంటగా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో ఈ జోడీ మీద మరింత క్రేజ్ పెరిగింది. ప్రొమోషన్లలో భాగంగా విడుదల చేసిన పోస్టర్స్, టీజర్స్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచేస్తున్నాయి. 'పుష్ప 2' కేవలం సినిమా మాత్రమే కాదు, ఒక బ్రాండ్‌గా మారిపోతుంది. ఈ ప్రెస్ మీట్ ద్వారా మేకర్స్ సినిమా ప్రమోషన్ స్ట్రాటజీపై ఎంత ఫోకస్ పెడుతున్నారో స్పష్టంగా అర్థమవుతుంది. సినిమాలో రష్మిక పాత్ర మరింత పవర్ఫుల్ గా ఉండబోతోందని, అల్లు అర్జున్ మరింత ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకోబోతున్నారని తెలుస్తోంది. ఈ ఈవెంట్‌తో 'పుష్ప 2' కి సంబంధించిన హైప్ మరింత పెరిగింది. డిసెంబర్ 4న యూఎస్ ప్రీమియర్ షోలతో మొదలవుతూ, డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతున్న ఈ చిత్రం తెలుగు సినిమా స్థాయిని మరింత పెంచుతుందని భావిస్తున్నారు.

## ఇమాన్వి.. ప్రభాస్ కోసం కాస్ట్లీ కండిషన్స్!

డార్లింగ్ ప్రభాస్ వరుసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్న సంగతి అందరికి తెలిసిందే. బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ చేస్తూ ఉండటం వలన ఏ సినిమాకి ఎప్పుడు డేట్స్ కేటాయిస్తారనేది క్లారిటీ లేదు. అయితే దర్శకులు మాత్రం ఆయనతో చేస్తోన్న సినిమా షూటింగ్స్ మొదలెట్టేస్తున్నారు. ప్రభాస్ లేని సన్నివేశాలని ముందుగా తెరకెక్కించే పనిలో పడ్డారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' అనే మూవీ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ నెల రోజుల క్రితమే హను మొదలుపెట్టారు. తమిళనాడులో కీలక సన్నివేశాలు షూట్ చేశారు. ఈ సినిమాలో ఇమాన్వి ఇస్మాయిల్ అనే కొత్త అమ్మాయి హీరోయిన్ గా నటిస్తోంది. ఆమెకిదే మొదటి చిత్రం. హీరోయిన్ గా అరంగేట్రంతోనే ప్రభాస్ తో జతకట్టే ఛాన్స్ ని ఇమాన్వి సొంతం చేసుకుంది. అయితే అన్ని రకాల స్క్రీన్ టెస్ట్స్ చేసిన తర్వాత సినిమాలోని



పాత్రకి ఆమె కరెక్ట్ గా సరిపోతుందని డిసైడ్ అయ్యి హను రాఘవపూడి ఇమాన్విని ఎంపిక చేసారని సమాచారం. ఇదిలా ఉంటే ప్రభాస్ 2025 సంక్రాంతి ఫెస్టివల్ తర్వాత ఈ మూవీ షూటింగ్ లో జాయిన్ అయ్యే అవకాశం ఉందంట. అప్పుడు కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేయనున్నట్లు టాక్. ఇదిలా ఉంటే 'ఫౌజీ' మూవీ కోసం ఇమాన్వితో మైత్రీ మూవీ మేకర్స్ ఏడాది డేట్స్ కోసం అగ్రిమెంట్ చేసుకున్నారంట. ఈ ఏడాది కాలంలో ఎప్పుడు షూటింగ్ ఉన్న వెంటనే వచ్చేలా ఆమెతో ఒప్పంతం చేసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అమెరికాలో ఉంటున్న ఇమాన్వి షూటింగ్ లో రావడానికి బిజినెస్ క్లాస్ జర్నీ, 5స్టార్ హెూటల్ విడిది ఏర్పాటు చేయబోతున్నారంట. ప్రభాస్ ఎప్పుడు డేట్స్ అడ్జస్ట్ చేస్తే అప్పుడు ఆమె షూటింగ్ కి రావాలని ఇమాన్వికి సూచించారని తెలుస్తోంది. పాన్ ఇండియా మూవీ అది కూడా ప్రభాస్ లాంటి నెంబర్ వన్ స్టార్ తో జోడీగా మొదటి చిత్రమే చేసే అవకాశం అంటే సామాన్య విషయం కాదు. ఈ అదృష్టం ఇమాన్వికి దక్కింది. అందుకే 'ఫౌజీ' తర్వాత తన కెరియర్ కూడా కంప్లీట్ గా మారిపోతుందని ఇమాన్వి భావిస్తోంది. అందుకే బల్క్ కాల్ షీట్స్ ని ఈ సినిమా కోసం కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఫౌజీ మూవీ హిట్ అయితే కచ్చితంగా తెలుగు, హిందీ భాషలలో ఆమె పేరు ప్రముఖంగా వినిపించే ఛాన్స్ ఉంది. అలాగే వరుస అవకాశాలు కూడా రావొచ్చని సినీ విశ్లేషకులు అంటున్నారు.




## రైతుల జీవితాల్లో పండగ తెచ్చాం.. సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు చేశారు. "ఏడాది క్రితం సరిగ్గా ఇదే రోజు.. పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు పోలింగ్ బూత్‌కు వెళ్లి "మార్పు" కోసం ఓటేశాడు. ఆ ఓటు అభయహస్తమై రైతన్న చరిత్రను తిరగరాసింది. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ.. రూ.7,625 కోట్ల రైతు భరోసా.. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్.. రూ.10,444 కోట్ల ఉచిత విద్యుత్.. రూ.1433 కోట్ల రైతు బీమా.. రూ.95 కోట్ల పంట నష్ట పరిహారం.. రూ.10,547 కోట్ల ధాన్యం కొనుగోళ్లు.. ఒక్క ఏడాదిలో 54 వేల కోట్ల రూపాయలతో రైతుల జీవితాల్లో పండగ తెచ్చాం.

ఇది నంబర్ కాదు.. రైతులు మాపై పెట్టుకున్న నమ్మకం. ఈ సంతోష సమయంలో అన్నదాతలతో కలిసి రైతు పండగలో పాలు పంచుకోవడానికి ఉమ్మడి పాలమూరుకు వస్తున్నా" అని రేవంత్‌రెడ్డి పోస్టు చేశారు.



## డిసెంబరు 5న కొలువుదీరనున్న 'మహా' కొత్త సర్కారు..?

ముంబయి: మహారాష్ట్రలో డిసెంబరు 5న మహాయుతి నూతన సర్కారు కొలువుదీరే అవకాశం ఉందని భాజపా సీనియర్ నేత పేర్కొన్నారు. సీఎం రేసులో దేవేంద్ర ఫడణవీస్ ముందంజలో ఉన్నారని..తదుపరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఆయనకు ఎక్కువగా ఉందని అన్నారు. ఫడణవీస్ గతంలో రెండు సార్లు సీఎంగా, ఒకసారి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహించారని..మరోసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టనున్నారని తెలిపారు. దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో సీఎం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు భాజపా శాసనసభా పక్ష నేతను ఎంపిక చేసేందుకు డిసెంబర్ 2న సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి 288 అసెంబ్లీ సీట్లలో 230 కైవసం చేసుకుని అధికారాన్ని నిలబెట్టుకుంది. భాజపా 132 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించగా, శివసేన 57, ఎన్సీపీ 41 సీట్లు గెలుచుకున్నాయి. కొత్త సీఎం ఎవరనే అంశంపై మహాయుతిలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటు మరింత ఆలస్యమవుతోంది. సీఎం అభ్యర్థి రేసులో దేవేంద్ర ఫడణవీస్, మురళీధర్, వినోద్ తావ్డే, రాధాకృష్ణ విఖే-పాటిల్ వంటి ప్రత్యామ్నాయ పేర్లను అగ్రనాయకత్వం పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ఈ విషయంపై ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే మాట్లాడుతూ.. సీఎం ఎంపిక, ప్రభుత్వ ఏర్పాటు విషయంలో ప్రధాని మోదీ, అమిత్ షాలదే తుది నిర్ణయమని, వారు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. దీంతో మహారాష్ట్ర సీఎం పగ్గాలు భాజపాకే దక్కుతాయని, దేవేంద్ర ఫడణవీస్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు డిప్యూటీ సీఎంలు, కేబినెట్ బెర్తులపై స్పష్టత రానుంది.

## రైతులను మోసం చేసి రైతు పండుగా?: హరీశ్‌రావు



హైదరాబాద్: రైతుబంధును రూపుమాపే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గమని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రైతు లకు దక్కిన బోనస్ సుమారు రూ.26 కోట్లు మాత్రమే అని చెప్పారు. రైతుబంధుకు ఏడాదికి రూ.7,500 కోట్లు జమ చేయాల్సి ఉంటుందని తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తే ఇంకా ఎక్కువ అవుతుందని పేర్కొన్నారు.

"రైతు బంధు కంటే బోనస్ అందించడం రైతులకు మేలు ఎలా అవుతుందో చెప్పాలి? రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు, కౌలు రైతులు మోసపోయినట్లేనా? వారిని విజయవంతంగా మోసం చేసినందుకు రైతుపండగ నిర్వహిస్తున్నారా? అన్నదాతలను నమ్మించి అధికారంలోకి వచ్చాక దగా చేసినందుకు విజయోత్సవాలా? మహబూబ్‌నగర్ కార్యక్రమంలో రైతుబంధు అమలుపై స్పష్టత ఇవ్వాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



## చికాగోలో కాల్పులు.. ఖమ్మం విద్యార్థి మృతి

చికాగో: అమెరికాలో చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ఖమ్మం జిల్లా వాసి మృతి చెందాడు. చికాగోలో దుండగుల కాల్పుల్లో సాయితేజ (26) అనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఖమ్మం గ్రామీణం రామన్నపేటకు చెందిన నూకరపు సాయితేజ.. ఎంఎస్ చదవడానికి నాలుగు నెలల క్రితమే అమెరికా వెళ్లాడు. ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్న అతడిపై దుండగులు కాల్పులకు పాల్పడినట్లు తెలుస్తోంది. సాయితేజ్ మృతి వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.




హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. గురుకుల బాట అనే కార్యక్రమం చేపట్టారని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "గురుకుల బాట అని చెప్పగానే కాంగ్రెస్‌కు భయం పుట్టింది. మంత్రి కొండా సురేఖ శుక్రవారం నాపై ఆరోపణలు చేశారు. నేను విద్యార్థులకు కలుషిత ఆహారం పెడుతున్నానని చెప్పారు. తెలంగాణ ప్రజలు గతంలోనే కొండా సురేఖను తిరస్కరించారు. మహిళలపై ఆమె చేసిన ఆరోపణలకు కేసు పెట్టాలని కోర్టు చెప్పింది.
ఆమెకు మంత్రి పదవిలో ఉండే అర్హత లేదు. గతంలో ఐపీఎస్ అధికారిగా ఉన్న నాకు కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చింది. ఏడేళ్ల సర్వీస్‌ను వదిలేసి విద్యార్థుల కోసం రాజకీయాల్లోకి వచ్చా. నాపై ఆరోపణలుంటే బయటపెట్టండి. వాటికి ఆధారాలుంటే సీబీఐ విచారణకు ఇవ్వండి" అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.




హైదరాబాద్: బలహీన వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తల కోసం బిక్కి ఏర్పాటు అభినందనీయమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. "మా ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతోంది. అత్యుత్తమ ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చాం. విధానాలను ఆచరణలో పెట్టడమే పెద్ద సవాల్. సమ్మిళిత అభివృద్ధి కోసమే మా ప్రభుత్వం కృషి చేస్తోంది. 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా కార్యక్రమాలుండాలేనేది ప్రభుత్వ అభిమతం. ఉపాధి కులాలవారీగా అందాలనే ఉద్దేశంతో కులగణన చేస్తున్నాం. ఎన్ని సవాళ్లు వచ్చినా అధిగమిస్తున్నాం. సవరణ అవసరం అయితే చట్టాల మార్పు కోసం కేంద్రం సాయం తీసుకుంటాం. బిక్కి ప్రతిపాదనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులు తీసుకొస్తాం. బ్యాంకుల నుంచి రుణాలు, ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి సమస్యలు రాకుండా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం. వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తాం. ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లోనూ పరిశ్రమలు విస్తరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం" అని మంత్రి వివరించారు.

## ఆ కుట్ర వెనక బీఆర్ఎస్ హస్తం ఉంది: సీతక్క సంచలన ఆరోపణలు..



మహబూబాబాద్: తెలంగాణ ప్రభుత్వ వసతి గృహాల్లో వరస ఫుడ్ పాయిజన్ ఘటనలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆహారం కల్తీ కావడం వెనక బీఆర్ఎస్ పార్టీ రాజకీయ కుట్ర దాగి ఉందని సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ నాయకులతో సంబంధం ఉన్న కొంతమంది ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగానే ఆహారాన్ని కలుషితం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. అందరూ కలిసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. రాజకీయం కోసం విద్యార్థులను బలి తీసుకునే కుట్ర జరుగుతోందని మంత్రి ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకే బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని సీతక్క ఆరోపించారు. ఉద్యోగులకు కుట్రతో సంబంధం ఉందని తేలితే వారిని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు సీతక్క. కుట్ర వెనక ఏ స్థాయి నేతలున్నా విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. రాజకీయ నేతలతో అధికారులు కుమ్మక్కైనట్లు తేలిస్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అన్ని ఘటనలపై విచారణ చేసి పూర్తి వివరాలను త్వరలోనే బయటపెడతామని మంత్రి సీతక్క తెలిపారు. కాగా, ఇటీవల కాలంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్ వాడీల్లో కేంద్రాల్లో తరచూ ఫుజ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయి. నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు ఆహారం కలుషితం అయ్యింది. పదుల సంఖ్యలో విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వగా.. చికిత్సపొందతూ ఓ విద్యార్థిని మృతిచెందింది. ఫుజ్ పాయిజన్ ఘటనలపై తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం సైతం దాఖలైంది. దీంతో అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అప్రమత్తమైన తెలంగాణ సర్కార్.. ఫుడ్? పాయిజన్ కారణాలు తేల్చేందుకు ప్రత్యేక టాస్క్?ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లాస్థాయి అధికారితో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఘటనలపై విచారణ చేసి రిపోర్టును ఈ కమిటీ ప్రభుత్వానికి అందించనుంది.

## పార్టీ కేడర్‌కు పీసీసీ చీఫ్ కీలక సూచన



హైదరాబాద్ : పార్టీలోని కింద స్థాయి నాయకుల కష్టంతోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు (టీపీసీసీ) మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కష్టపడిన నాయకులకు పార్టీలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీలోని నేతలకు అన్ని రకాల పదవులల్లో అవకాశం కల్పిస్తామన్నారు. శనివారం గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇష్టం వచ్చినట్లు దోచుకున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై ఆయన మండిపడ్డారు. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని నాశనం చేసిన చరిత్ర బీఆర్ఎస్ వాళ్ళదని ఆయన విమర్శించారు.

**రూ. 8 లక్షల కోట్ల అప్పు..** బీఆర్ఎస్ నేతలు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని రకాల హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని మంచి పనులు చేసిన.. బీఆర్ఎస్ నేతలు మనపై అబద్ధాలు ప్రచారం చేస్తూ రాజకీయంగా పబ్బం గడుపుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయాల్సిన ఆవసరం ఉందన్నారు. మనం చేసిన పనులను మనం చెప్పుకోకపోతే వెనుకబడిపోతామని పార్టీ కేడర్‌కు ఆయన కీలక సూచన చేశారు.

**పార్టీ శ్రేణులకు పిలుపు..** బీఆర్ఎస్, బీజేపీలు మనపై చేస్తున్న అబద్ధాలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ పిలుపు నిచ్చారు. 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిదని తెలిపారు. అలాగే 10 ఏళ్లలో చేయ లేని పనులు 10 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిందని గుర్తు చేశారు. బీజేపీ మత తత్వ ప్రచారంతో లబ్ధి పొందుతుందని ఆరోపించారు.

**రాహుల్‌ని ప్రధాని చేయాలి..** అయితే బీజేపీ మతతత్వ ప్రచారాన్ని మోడీ అబద్ధాలను సైతం తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత మనపై ఉందని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు ఆయన సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని దేశానికి ప్రధానిగా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దేశాన్ని ఒక్కతాటిపైకి తెచ్చి అభివృద్ధి చేసే లక్ష్యంతో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.




## కొనసాగుతున్న ఏసీబీ సోదాలు

హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నీటిపారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్ నివాసంలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఉదయం 6గంటల నుంచి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. నిఖేశ్ బంధువులతో పాటు సన్నిహితుల ఇళ్లలో కలిపి మొత్తం 30 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు జరిపిన సోదాల్లో ఫాంహౌస్‌లతో పాటు భారీగా వ్యవసాయ భూములు, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. కేజీల కొద్దీ బంగారం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు గుర్తించిన ఏఈఈ ఆస్తులు మార్కెట్ విలువ ప్రకారం... దాదాపు రూ.150 కోట్లకుపైనే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. సోదాల అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com